

పంచాయతీ కార్యదర్శి పుల్లయ్య

లంచం అడిగినందుకు అరెస్టు

- రేగళ్ల పంచాయతీ కార్యదర్శిపై ఏసీబీ చర్య
- ఎన్‌వోసీ జారీకి లంచం వేధింపులు
- విసిగి వేసారి ఏసీబీకి పట్టించిన బాధితుడు

లక్ష్మీదేవిపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నో ఆబ్జెక్షన్ సర్టిఫికెట్ ఇచ్చేందుకు ఓ పంచాయతీ కార్యదర్శి లంచం డిమాండ్ చేసినందుకు ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్ల పంచాయతీలో మంగళవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి ఖమ్మం ఏసీబీ డీఎస్పీ రమేష్ తెలిపిన వివరాలు ఇలా వున్నాయి... రేగళ్ల పంచాయతీలో భూక్యా లక్ష్మా అనే వ్యక్తి తన ఇంటికి విద్యుత్ కనెక్షన్ నిమిత్తం నో ఆబ్జెక్షన్ సర్టిఫికెట్ జారీ చేయాలని పంచాయతీ కార్యదర్శి కాంపాటి పులయ్యను కోరాడు. అయితే సర్టిఫికెట్ ఇచ్చేందుకు రూ.20 వేలు లంచం కావాలని పంచాయతీ కార్యదర్శి డిమాండ్ చేశాడు. చివరకు లక్ష్మా రూ.18వేలు ఇచ్చేందుకు అంగీకరించాడు. ఆ తర్వాత మనసు మార్చుకొని ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారి సూచన ప్రకారం పంచాయతీ కార్యదర్శితో మాట్లాడిన ఫోన్ సంభాషణలను రికార్డు చేశాడు. కానీ లంచం డబ్బులు ఇస్తూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టించడానికి ముందుకు రాలేదు. ఫోన్ సంభాషణల ఆధారంగా చర్యలు తీసుకోవాలని కోరాడు. దీంతో ఏసీబీ అధికారులు ఫోన్ కాల్ రికార్డులను ఆధారంగా చేసుకొని పంచాయతీ కార్యదర్శి పులయ్యను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఆయనను ప్రత్యేకంగా విచారించగా, లంచం అడిగింది వాస్తవమనేనని ఒప్పుకున్నాడు. దీంతో లంచం అడగడం కూడా నేరమే కాబట్టి పుల్లయ్యపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్టు ఏసీబీ డీఎస్పీ రమేశ్ తెలిపారు.



మన రైతులకే బోనస్

- పకడ్బందీగా సన్నధాన్యం కొనుగోళ్లు
- రైతులకు అవగాహన కల్పించాలి
- ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రత్యేక అధికారి కె. సురేంద్ర మోహన్ 4

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తలపెట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే జిల్లాలో బుధవారం నుంచి ప్రారంభం కాబోతుంది. ఈ నెలాఖరులోగా సర్వేను పూర్తిచేయబోతున్నారు. జిల్లాస్థానికసంస్థల అదనపు కలెక్టర్ పి.శ్రీజ జిల్లా నోడల్ అధికారికంగా సర్వే తంతును పర్యవేక్షించనున్నారు. సూపర్‌వైజర్లు, ఎన్యుమరేటర్లకు మండల, స్పెషల్ ఆఫీసర్లకు సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై పూర్తిస్థాయి శిక్షణ ఇచ్చి ఆయా బ్లాకులకు సంబంధించి సర్వే ఎన్యుమరేటర్లను, సూపర్‌వైజర్లను నియమించడంతో మంగళవారం కొందరు ఇళ్లకు వెళ్లి బ్లాకులను గుర్తించారు. జిల్లాలో మొత్తం 6,33,304 ఇళ్లు ఉండగా 3719 మంది ఎన్యుమరేటర్లను నియమించారు. మొత్తం 3673 బ్లాకులు ఏర్పాటు చేశారు. వాటి ప్రకారం ఎన్యుమరేటర్లతో పాటు 14మంది సూపర్‌వైజర్లను నియమించారు. ఎన్యుమరేటర్లలో 1518మంది ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు 1158మంది ఉన్నారు. జిల్లాలో 589 జీపీలు, 126 మునిసిపల్ వార్డుల్లో సర్వే నిర్వహించబోతున్నారు.



ఇంటింటి సర్వేకు సర్వం సిద్ధం

6,33,304 ఇళ్లు
3,719 మంది ఎన్యుమరేటర్లు

- మొదటి రెండు రోజులు బ్లాకుల వారీగా ఇళ్ల గుర్తింపు
- ఒక్కో ఎన్యుమరేటర్‌కు 50నుంచి 150 ఇళ్ల కేటాయింపు
- సేకరించిన సమాచారం గోప్యంగా ఉండేలా చర్యలు
- నోడల్ అధికారిగా అదనపు కలెక్టర్ పి.శ్రీజ
- నియోజకవర్గాలకు, మండలాలకు ప్రత్యేక అధికారులు
- ఈ నెలాఖరు వరకు కొనసాగనున్న సర్వే ప్రక్రియ

ఖమ్మం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఇంటింటి సర్వేకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఒక్కో ఎన్యుమరేటర్ కనీసం 50నుంచి 150 ఇళ్లను సర్వేచేయాల్సి ఉంటుంది. సర్వేచేసిన డేటాను సాయంత్రం ఆరుగంటలకే మండల కార్యాలయాలకు చేర్చి ఎంట్రీ చేయాల్సి ఉంటుంది. సర్వేలో ఆయా కుటుంబాల ఆర్థిక, సామాజిక, విద్య, ఉపాధి వివరాలను సేకరిస్తారు. కులాల వారీగా కుటుంబాలను గుర్తిస్తారు.. ప్రయోజాలను పొందుతున్నారా లేదా అనేది తెలుసుకుంటారు.. ఆయా కుటుంబాలు ఏ కుల వృత్తిలో ఉన్నాయో తెలుసుకొని నమోదు చేస్తారు... కులాలు, మతాలు, ఉపకులాలు, విద్యార్హతలు, స్థిరాస్తులు, భూములు, రిజర్వేషన్ ప్రయోజనాలన్నింటిని సమగ్రంగా తెలుసుకుంటారు. ఒక్కో కుటుంబానికి కనీసం అరగంటపైగా సమయం పట్టనుంది. రోజుకు 10 ఇళ్లనైనా తగ్గకుండా సర్వే నిర్వహించాలి. సర్వేసమాచారాన్ని ముందుగానే ఆయా వార్డుల్లో తెలియపరచాల్సి ఉంటుంది. జిల్లాలో సర్వే ప్రక్రియ కలెక్టర్ ముజమిల్‌ఖాన్‌తో పాటు అదనపు కలెక్టర్ శ్రీజ తదితరులు పర్యవేక్షించనున్నారు. వీరితో పాటు ఖమ్మం నియోజకవర్గానికి జడ్పీ డీప్యూటీ సీఈవో నాగలక్ష్మి, పాలేరుకు అడిషనల్ డీఆర్వో నూరుద్దీన్, వైరాకు డీఎల్‌పీవో రాంబాబు, సత్తుపల్లికి కల్లూరు ఆర్డీవో రాజేందర్, మధిరకు ఖమ్మం ఆర్డీవో నర్సింహారావునియమితులయ్యారు. మండలాలకు జిల్లాస్థాయి అధికారులను నియమించారు. వీరు కూడా సర్వేను పరిశీలించనున్నారు. సిబ్బంది అందరికి సర్వే నిమిత్తం రాయడానికి ప్యాడ్, పెన్సిల్, బాల్‌పెన్, సీడీ మార్కర్, ఎరైజర్ అందించారు.

సమాచారంపై గోప్యత

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో ఇచ్చిన సమాచారంపై గోప్యత పాటించాల్సి ఉంటుంది. సర్వేసంద్భంగా తీసుకునే సమాచారం గోప్యంగా ఉంచాలి. సమచారం ప్రభుత్వ పథకాలు, ప్రణాళికలు అర్హులైన అన్నివర్గాలకు అందించేందుకు అవసరమైన ప్రణాళికలు తయారచేయడానికి అని వివరించాలి. సర్వే అయిన ఫారాలు డేటా ఎంట్రీ ఆపరేటర్‌కు అందించాలి. డేటా ఎంట్రీ తరుణంలో సర్వేఫారాలను గోప్యంగా ఉంచాలి. సమాచారం బయటకు పొక్కకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు ఇప్పటికే సూచించారు.

రెండు భాగాలు... 75 ప్రశ్నలు...

ఇంటింటి సర్వేను ప్రశ్నావళి రూపంలో నిర్వహిస్తారు. 56 ప్రధాన ప్రశ్నలు, 19 అనుబంధ ప్రశ్నలతో కలిపి మొత్తం 75 ప్రశ్నలకు సంబంధించిన సమాచారం సేకరిస్తారు. పార్ట్ - 1, పార్ట్ - 2 కింద 8 పేజీల్లో సమాచారం నిక్షిప్తం చేస్తారు. పార్ట్ - 1 లో కుటుంబ యజమాని, సభ్యుల వ్యక్తిగత సమాచారం కింద విద్య, ఉద్యోగం, ఉపాధి, వ్యవసాయ భూములు, ప్రభుత్వ రిజర్వేషన్ ప్రయోజనాలు, రాజకీయ, వలసల సమాచారం ను ప్రశ్నల రూపంలో అడిగితెలుసుకుంటారు. పార్ట్- 2 కింద కుటుంబ వివరాలను సేకరిస్తారు. ఇందులో 17 ప్రశ్నలకు 7 ప్రధాన 10 అనుబంధ ప్రశ్నలకు సమాచారం సేకరిస్తారు. సేకరించిన సమాచారాన్ని ఏరోజుకు ఆరోజే ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేయడానికి ఏర్పాట్లు పూర్తి చేశారు.



ఇంటర్వ్యూ

సర్వే సిబ్బందికి సహకరించండి

- ఎట్టి పరిస్థితుల్లోనూ తప్పుడు వివరాలు ఇవ్వొద్దు
- అందుబాటులో లేని వారికి ఫోన్ ద్వారా సమాచారం ఇస్తాం
- ఏ ఒక్క కుటుంబాన్ని మిస్ కానివ్వం
- వివరాలు చెబితే ఏదో జరుగుతుందనే అపోహ వద్దు
- సమస్యలుంటే 1077 టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేయాలి
- జిల్లా అదనపు కలెక్టర్, సర్వే నోడల్ అధికారి పి. శ్రీజ

ఖమ్మం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): ఖమ్మం జిల్లాలో బుధవారం నుంచి ఈ నెలాఖరు వరకు చేపట్టబోతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు జిల్లాలో అన్ని ఏర్పాట్లు చేశామని జిల్లా అదనపు కలెక్టర్, సర్వే నోడల్ అధికారి పి.శ్రీజ తెలిపారు. సర్వేకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామని, ఏ ఒక్క కుటుంబాన్ని మిస్‌కానివ్వమని, ఇందుకు సంబంధించి ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లు, మండలనియోజకవర్గ స్పెషలాఫీసర్లను కూడా నియమించామని స్పష్టం చేశారు. సర్వే నిర్వహణ తీరుతెన్నులపై ఆమె మంగళవారం 'ఆంధ్రజ్యోతి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.

ప్రశ్న: జిల్లాలో ప్రభుత్వం జరుపుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు ఏర్పాట్లు?

జవాబు: ప్రభుత్వం బుధవారం నుంచి ఈ నెలాఖరు వరకు చేపట్టబోతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు జిల్లాలో అన్ని ఏర్పాట్లు చేశాం. పకడ్బందీగా ఇంటింటి సర్వే నిర్వహించబోతున్నాం. ఏ ఒక్క కుటుంబాన్ని మిస్‌కానివ్వం. ఇందుకు సంబంధించి ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లు, మండలనియోజకవర్గ స్పెషలాఫీసర్లను కూడా నియమించాం

ప్ర: సర్వే ఎప్పటి నుంచి ఎప్పటి వరకు?

జ: వాస్తవ సర్వే 8వతేదీ నుంచి మొదలవుతుంది. ఈ రెండురోజులు కూడా ఎన్యుమరేరట్లకు ఇళ్లను కేటాయించి స్టిక్కర్అంటించే కార్యక్రమం నిర్వహిస్తాం. 8 నుంచి సమగ్ర ఇంటింటి సర్వే కార్యక్రమం ఉంటుంది. ఈ సర్వేలో ప్రతి కుటుంబం నుంచి యజమాని తప్పనిసరిగా సర్వేలో పొందుపరిచిన వ్యక్తిగత కుటుంబ వివరాలతో (మిగతా 4వ పేజీలో)



ఖమ్మంలో గిరిజన సమ్మేళనంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని

హక్కుల కోసం ఐక్య పోరాటాలు

- గుగులోతు ధర్మాను స్ఫూర్తిగా తీసుకోవాలి
- 'సనాతన ధర్మం' కుట్రలను తిప్పికొట్టాలి
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం
- నగరంలో హోరెత్తిన రాష్ట్రస్థాయి గిరిజన సమ్మేళనం

ఖమ్మం టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): గిరిజన హక్కులకోసం ఐక్యంగా పోరాటాలు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పిలుపునిచ్చారు. తెలంగాణ గిరిజనసంఘం వ్యవస్థాపక నాయకుడు గుగులోత్ ధర్మానాయక్ ప్రథమ వర్ధంతిని పురస్కరించుకొని మంగళవారం ఖమ్మంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో గిరిజనసంఘం జిల్లా కార్యదర్శి భూక్యా వీరభద్రం అధ్యక్షతన నిర్వహించిన రాష్ట్రస్థాయి గిరిజన సమ్మేళనంలో తమ్మినేని మాట్లాడారు.

గిరిజనుల హక్కులు సాధించాలంటే గిరిజన సంఘం వ్యవస్థాపక నాయకుడు గుగులోత్ ధర్మాను స్ఫూర్తిగా తీసుకొని ఉద్యమించాలని అదే ధర్మాకు ఇచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. భారత రాజ్యాంగంలో గిరిజనులకు ఉన్న హక్కులను కాలరాసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తున్నదని, ప్రజాస్వామికవాదులు, గిరిజన సంఘాలు ఐక్యంగా తిప్పికొట్టాలని కోరారు. గిరిజనుల సంస్కృతి సాంప్రదాయాలపై మనువాద సంస్కృతిని బలవంతంగా రుద్ది గిరిజనుల ఉనికికే ప్రమాదం వచ్చే విధంగా పాలకులు వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సనాతన ధర్మం పేరుతో కులాల నిచ్చెన మెట్ల వ్యవస్థను ప్రతిష్ఠించే ప్రయత్నం జరుగుతున్నదని అందరం కలిసి తిప్పికొట్టాలన్నారు. మాజీ శాసనసభ్యుడు జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ గుగులోత్ ధర్మా ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు రాష్ట్రవ్యాప్తంగా గిరిజన సమస్యలతో పాటు ప్రజా సమస్యలపై పోరాడిన గొప్ప నాయకుడని అన్నారు. విద్యార్థి దశలోనే వామపక్ష భావాలవైపు ఆకర్షితుడై మార్క్సిస్టు పార్టీలో అంచలంచెలుగా ఎదుగుతూ 1973 నుండి విద్యార్థి, యువజన సంఘాల్లో చేరి విద్యార్థి, యువకుల సమస్యలపై అనేక ఉద్యమాలు నిర్వహించారన్నారు.

తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీరాంనాయక్ మాట్లాడుతూ ధర్మా స్ఫూర్తితో రాష్ట్ర వ్యాపితంగా గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై గిరిజన సంఘం పోరాడుతుందని అన్నారు. తెలంగాణ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి భూక్యా వీరభద్రం మాట్లాడుతూ గిరిజన సమస్యలపై పోరాడేందుకు గిరిజన నాయకులు, మేధావులు, ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు ఐక్యంగా కలిసి రావాలని పిలుపునిచ్చారు.

ఈ సమ్మేళనంలో సీపీఎం నాయకులు పోతినేని సుదర్శన్, పి.సోమయ్య, గుగులోత్ ధర్మా సతీమణి కౌసల్య, కొడుకు, కూతురు గుగులోతు రవి కిరణ్, ఐఆర్ఎస్ అధికారి బానోతు విజయబాయి, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మూడ్ ధర్మనాయక్, ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు (మిగతా 4వ పేజీలో)

'యూనిఫామ్' దందా



ఖమ్మం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లాకు తలమానికంగా చెప్పుకొనే ప్రభుత్వ ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ డిగ్రీ, పీజీ కళాశాలలో యూనిఫామ్ పేరుతో దందా సాగుతున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. కళాశాలకు చెందిన కొందరు ముఖ్యులు చేతికి మట్టి అంటకుండా లక్షల్లో అక్రమాలకు పాల్పడుతున్నట్టు ప్రచారం జరుగుతోంది. నగరం నడిబొడ్డున్న వున్న ఈ కళాశాలలో ప్రతీయేడాది సుమారు 6 వేల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తుంటారు. అయితే విద్యార్థుల నుంచి యూనిఫామ్ డ్రెస్ మెటీరీయల్ పేరుతో పెద్ద ఎత్తున వసూళ్ల చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రూ.వెయ్యి కూడా ఖరీదు చేయని యూనిఫామ్ మెటీరియల్‌కు ఒక్కో విద్యార్థి నుంచి రూ. 2 వేల వరకు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఈ కళాశాలకు దుస్తులు పంపిణీ చేసే కాంట్రాక్టర్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఓ ప్రభుత్వ కళాశాలకు సైతం మెటీరియల్ సరఫరా చేస్తుండగా, అక్కడ రూ. వెయ్యిలోపు మాత్రమే తీసుకుంటుండటం గమనార్హం. యూనిఫామ్ మెటీరియల్ విక్రయాల సమయంలో నగదు వసూలు చేసినప్పుడు ఎలాంటి రశీదులు ఇవ్వకపోవడం కొసమెరుపు.

- ప్రభుత్వ ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ కళాశాలలో డ్రెస్ మెటీరియల్ విక్రయాల్లో మాయ
- కళాశాల ఆవరణలో బయటి వ్యక్తుల కౌంటర్
- అధిక ధరలతో దోపిడీ.. కళాశాల ముఖ్యుల సపోర్ట్?
- ఏటా రూ.60 లక్షలు అక్రమంగా వసూలు చేస్తున్నట్టు ఆరోపణలు
- గతంలోనే కలెక్టర్‌కు విద్యార్థుల ఫిర్యాదు

అక్రమాల విధంబెట్టిదనిన..

ఏదైనా ప్రభుత్వ కళాశాలకు సంబంధించి యూనిఫామ్ ఏర్పాటు చేస్తే, దానికి సంబంధించిన మెటీరియల్ ఎక్కడ లభ్యమవుతుందో చెప్పి విద్యార్థులను కొనుగోలు చేసుకోమని సూచించాలి. వాటి విక్రయాలకు సంబంధించి కళాశాలకు ఎలాంటి సంబంధాలు ఉండకూడదు. కానీ ప్రస్తుతం ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎస్ఆర్‌అండ్‌బీజీఎన్ఆర్ కళాశాలలో నేరుగా కళాశాలలోనే యూనిఫామ్ మెటీరియల్ విక్రయించుకునేందుకు స్థలం కేటాయించడం గమనార్హం. అంతేకాదు ఫలానా గదిలో యూనిఫామ్ మెటీరియల్ ఇస్తున్నారంటూ నేరుగా కళాశాల వాట్సాప్ గ్రూపుల్లో సందేశాలు సైతం పంపించారు. ప్రతీ విద్యార్థి యూనిఫామ్‌తోనే రావాలని, లేనిపక్షంలో అడ్మిషన్లు కూడా ఇవ్వమనే రీతిలో కళాశాల ముఖ్యులు హుకుం జారీ చేశారని విద్యార్థులు చెబుతున్నారు.

లక్షల్లో అవినీతి

యూనిఫామ్ మెటీరియల్ పేరుతో విద్యార్థుల నుంచి అక్రమంగా వసూలు చేసిన మొత్తం లక్షల్లో ఉంటుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రతీయేటా ఈ కళాశాలలో 2వేల మంది వరకు (మిగతా 4వ పేజీలో)

సరిగమల సవ్వడి

- నగరంలో పెరుగుతున్న గాయనీగాయకులు, సంగీత కళా సంఘాలు
- చిన్న వేదికల నుంచి ఆర్కెస్ట్రా వరకు.. 4

కల్లూరు పట్టణం మునిసిపాలిటీ అయ్యేనా!?

- గతంలో ప్రభుత్వానికి ప్రతిపాదనలు
- అన్ని అర్హతలు ఉన్న మేజర్ పంచాయతీ
- ఈ ప్రభుత్వంలోనైనా మోక్షం కలుగుతుందా? 5

ఏఈవోల సహాయ నిరాకరణ

- డిజిటల్ క్రాప్ సర్వే చేయలేమని స్పష్టీకరణ
- సర్వేలో 9మంది కాంట్రాక్ట్ ఏఈవోలు 5



ఖమ్మం మార్కెట్‌లో పత్తి కొనుగోళ్లను పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మార్కెట్‌లోనే సీసీఐ కేంద్రం ఏర్పాటు చేయాలి

- పత్తి రైతులకు మద్దతు ధర ఇవ్వండి
- బీఆర్ఎస్ నాయకుల డిమాండ్
- ఖమ్మం వ్యవసాయ మార్కెట్ సందర్శన

వివరాలు : 4లో



ఖమ్మం మార్కెట్ గేటు ముందు సీపీఐ, రైతు సంఘం నాయకుల ఆందోళన

పత్తిని మద్దతు ధరకు కొనుగోలు చేయాలి

- సీపీఐ, రాష్ట్ర రైతు సంఘం నేతల డిమాండ్
- ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో ఆందోళన

వివరాలు : 4లో

అభిరుచి



ఖమ్మం నగరం పాటల పూదోటగా విరాజిల్లుతోంది.. కళాకారులు పలువురు పాటలపట్ల మక్కువ చూపుతుండటంతో సరిగమలు సందడి చేస్తున్నాయి.. ఖమ్మానికి సకల కళల గుమ్మం అన్నపేరు ఎప్పటినుంచో ఉండగా వాటిలో ఇటీవల పాటల కళాకారులు తమదైన ఉనికి ప్రదర్శిస్తున్నారు. గత కొంత కాలం వరకు కవిత్వం, నాటకం, వంటి రంగాల్లో కళాకారులు రాణించగా ప్రస్తుతం పాటల్లోనూ ప్రతిభ కనబరుస్తున్నారు.



సరిగమల సవ్వడి

- నగరంలో పెరుగుతున్న గాయనీగాయకులు, సంగీత కళా సంఘాలు
- చిన్న వేదికల నుంచి ఆర్కెస్ట్రా వరకు..
- పక్క జిల్లాల నుంచి వస్తున్న గెస్ట్ సింగర్స్
- రికార్డుల సాధనకు అనువైన ప్రదేశంగా గుర్తింపు

పాటల పూదోటగా ఖమ్మం నగరం



ఖమ్మంలో ఇటీవల జరిగిన పాటల రికార్డు నమోదు కార్యక్రమం

ఖమ్మం సాంస్కృతికం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి)ఖమ్మంలో గతంతో పోలిస్తే ఇటీవల గాయనీ గాయకుల సంఖ్య అధికం కావటంతోపాటు కొత్తగా సంగీత బృందాలు సైతం ఏర్పడటం పాటలకు లభిస్తున్న ఆదరణకు నిదర్శనం.. గాయకులు 40 మంది నుంచి 50 మంది వరకు తయారు కాగా గాయనిలు మరో పదిమంది వరకు ఉన్నారు. వీరంతా చిన్నచిన్న వేదికలు మొదలు లైవ్‌ఆర్కెస్ట్రా స్థాయి వరకు కళాకారులుగా మారారు.

గెస్ట్ సింగర్స్..

నగరంలోని పలు సంగీతసంఘాలలో సభ్యులుగా పలువురు గాయనీగాయకులు పాటలను పాడుతుండగా అవసరమైన సందర్భాల్లో పక్కజిల్లాలనుంచి, పక్కరాష్ట్రం నుంచి సైతం గాయనీ గాయకులను గెస్ట్ సింగర్స్ పేరుతో ఆహ్వానిస్తున్నారు. అలా వచ్చే గాయనీగాయకులు కేవలం కళపై మక్కువతో హాజరవుతూ ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో పాటలను పాడుతున్నారు. ఒక బృందంలోని గాయకులు ఇంకొక బృందం ఏర్పాటు చేసే గాన కార్యక్రమంలో గెస్ట్ సింగర్స్‌గా సహాయ సహకారం అదిస్తున్నారు.

రికార్డుల సాధన దిశగా...

గాయకుల సంఖ్య రోజు రోజుకూ పెరుగుతుండటంతోపాటు పాటల విభాగంలో రికార్డులు సాధించే స్థాయి వరకు చేరింది. ఇతర ప్రాంతాలకు చెందిన గాయనీమణులు సైతం ఖమ్మం వైపు దృష్టి సారిస్తుండటం స్థానికంగా పాటలకు లభిస్తున్న ఆదరాభిమానాలకు ఉదాహరణ. పాటల్లో రికార్డులను నెలకొల్పేందుకు ఖమ్మంనువేదికగా చేసుకుంటున్నారు. 24 గంటల నిరంతర పాటల కార్యక్రమం, 12 గంటల నిరాటంక పాటల ప్రదర్శణ వంటి కార్యక్రమాలకు ఖమ్మం వేదికగా మారింది. గాయనీ మణుల ఔత్సాహిక కార్యక్రమాలకు వండర్ బుక్స్, విశ్వం, తదితర సంస్థలు చేయూత నిచ్చాయి. సుదీర్ఘ గాన కార్యక్రమాలను ప్రత్యేకంగా నమోదు చేసి వారికి తమ రికార్డ్సులో చోటు కల్పించాయి. గతకొద్ది నెలల క్రితం ఒక గాయని 24 గంటల పాటు పాటలను ఆపకుండా పాడి రికార్డు సాధించగా, గత రెండు రోజుల క్రితం బాపట్లకు చెందిన మరో గాయని స్థానికంగా 12 గంటల పాటు పాటల ప్రదర్శన ఇచ్చి మరో రికార్డును నెలకొల్పారు.



అనేక సంగీత బృందాలు..

పాటలకు ప్రోత్సాహంగా నగరంలో ఇటీవల పలు సంగీత బృందాలు ఏర్పడ్డాయి. ఈ బృందాల ఆధ్వర్యంలో నిరంతరం పాటల సాధన చేస్తుండటంతో పాటు నెలకో రెండు నెలలకో పాటల ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నారు. ఘంటసాల, బాల సుబ్రమణ్యం, ఎన్టీఆర్, ఏఎన్నార్ జయంతి, వర్ధంతి కార్యక్రమాలను నిర్వహించటం, సంగీత దినోత్సవాన్ని జరపటం, ఇతర ప్రత్యేక సందర్భాలలో పాటల కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నారు. నగరంలో స్వర మాధురి, స్వర సుధ, స్వరరాగసుధ, స్వరమాలిక, ఘంటసాల కల్చరల్ అసోసియేషన్ తదితర పాటల ట్రూప్‌లలో గాయకులు పాటలను పాడుతున్నారు.

సొంత డబ్బు వెచ్చిస్తూ..

పాటలకు సంబంధించిన కళాసంస్థలు తమ సొంత డబ్బు వెచ్చించి కార్యక్రమాలను ఏర్పాటు చేస్తుండటం వారి కళాభిమానానికి నిదర్శనం. ఒక్కో సంస్థ ఏడాదిలో కనీసం రెండు మూడు సార్లు గాన లహరిని నిర్వహిస్తోంది. ట్రాక్, లైవ్ ప్రోగామ్స్‌గా పాటల కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఒక్కో ప్రోగాంకు రూ.60వేల నుంచి లక్ష రూపాయల వరకు ఖర్చు అవుతుడటంతో పలు సంస్థలు, వ్యక్తుల స్పాన్సర్‌తో కొద్ది పాటి మొత్తం సమకూరుతున్నా మరో సగం వరకు చేతినుంచి భరిస్తున్నారు.



కేఎన్‌డీ పురస్కారాలు పొందుతున్న ఖమ్మం గాయకులు

వ్యవసాయాన్ని చిన్నచూపు చూడొద్దు

- బీజేపీ రాష్ట్ర నాయకుడు తాండ్ర వినోద్‌రావు
- డ్రాగన్ ఫ్రూట్ సాగు చేసిన యువ ఇంజనీర్‌కు బీజేపీ సన్మానం



సోమాధరియాసింగ్‌ను సన్మానిస్తున్న తాండ్ర

కొణిజర్ల, నవంబరు5 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయాన్ని చిన్న చూపు చూడొద్దని, వ్యవసాయంలోనే సాయం ఉందని, దేశానికి వెన్నుముఖ రైతన్నేనని బీజేపీ రాష్ట్ర నాయకుడు తాండ్ర వినోద్ రావు తెలిపారు. మండల పరిధిలోని ఉప్పలచలక గ్రామానికి చెందిన గుగులోతు సోమాధరియాసింగ్ బీటెక్‌లో మెకానికల్ ఇంజనీర్ పూర్తి చేశారు. మూడు నెలలు పాటు ఎల్అండ్‌టీలో ఉద్యోగం చేసి ఉద్యోగం మానేసి వ్యవసాయం చేయాలనే ఆలోచనతో డ్రాగన్‌ఫ్రూట్ సాగు చేపట్టాడు. మూడు సంవత్సరాల నుంచి సాగు చేస్తూ లాభాలను గడిస్తున్నాడు. అక్టోబరు-19న యువ ఇంజనీర్‌పై కృషిపై ఆంధ్రజ్యోతిలో 'బీటెక్ బాబు..హైటెక్ సాగు' అంటూ కథనం కూడా ప్రచురితమైంది.

యువ ఇంజనీర్ డ్రాగన్‌ఫ్రూట్ సాగు చేస్తున్నాడని తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర నాయకుడు తాండ్ర వినోద్‌రావు కొణిజర్లలో మంగళవారం సోమాధరియాసింగ్‌ను శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా వినోద్‌రావు మాట్లాడుతూ యువత వ్యవసాయ రంగంలో ముందుకు రావాలని ఆకాంక్షించారు. ఉద్యోగాన్ని సైతం వద్దనుకొని వ్యవసాయ చేయాలనే ఆలోచన యవ ఇంజనీర్‌కు రావడం అభినందనీయం అన్నారు. యువత సోమాధరియాసింగ్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. వ్యవసాయరంగంలేనిదే దేశానికి మనుగడ కష్టమని ప్రధాని నరేంద్రమోదీ రైతుల కొరకు అనేక సంక్షేమ పథకాలు తీసుకొచ్చారని గుర్తు చేశారు. యువత కొత్తపద్ధతిలో లాభాలు వచ్చే వ్యవసాయాన్ని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, జిల్లా ప్రధానకార్యదర్శి శ్యామ్‌రాథోడ్, వైరా అసెంబ్లీ కన్వీనర్ నెల్లూరు కోటేశ్వరరావు, ప్రశాంత్‌కుమార్, వెంకటేశ్వర్లు, వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నాగుల చవితి..

పుట్టల్లో పాలు పోసి మొక్కులు తీర్చుకున్న భక్తులు

ఖమ్మం సాంస్కృతికం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నాగుల చవితి పర్వదినాన్ని మంగళవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరిపారు. మహిళలు పుట్టలలో పాలు పోసి తమ మొక్కులు చెల్లించుకున్నారు. జిల్లాలోని పలు ఆలయాల్లోగల పుట్టల వద్ద ఈ పండుగను నిర్వహించారు. నాగుల చవితి రోజున పుట్టల్లో పాలు పోస్తే మంచిదన్న నమ్మకంతో మహిళా భక్తులు తెల్లవారు ఝామునుంచే పుట్టలను సందర్శించారు. దీంతో వివిధ ఆలయాల్లో గల పుట్టల వద్ద విపరీత రద్దీ ఏర్పడింది. ఖమ్మం నగరంలో ఎన్నెస్పీ క్యాంపు రామాలయం, సుగ్గల వారి తోట శివాలయం, ఆర్ అండ్ బీ అతిథి గృహం , నరసింహస్వామి దేవాలయం (గుట్ట) వద్దగల పుట్టలకు భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. భక్తుల రాకను దృష్టిలో ఉంచుకొని ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.ముందుగా పుట్టలకు పసుపు, కుంకుమలతో పూజించి ఆ తరువాత పాలు పోశారు. కొందరు కోడి గుడ్లను సైతం పుట్టల వద్ద ఉంచారు. మరికొందరు చిన్న పిల్లలకు చెవులు కుట్టించే కార్యక్రమాలను నిర్వహించుకున్నారు. ప్రసాదాలను పంచి పెట్టారు.



చిన్నారికి చెవి కుట్టిస్తున్న దృశ్యం



పుట్టవద్ద పూజలు చేస్తున్న భక్తులు

'యూనిఫామ్' దందా

(3వ పేజీ తరువాయి)

కొత్తగా విద్యార్థులు చేరుతుండగా.. డిగ్రీ, పీజీ కోర్సులకు సంబంధించి సుమారు 6వేల మంది విద్యార్థులకుగాను యూనిఫామ్ పేరుతో ఒక్కో విద్యార్థి నుంచి రూ.వెయ్యి అదనంగా వసూలు చేసినా రూ. 60 లక్షలు అదనంగా వసూలు చేశారని ఆరోపణలు వస్తున్నాయి.

యూనిఫామ్‌ల పేరుతో వసూళ్లు, కళాశాల మైదానానికి సంబంధించి వసూలు చేసే అద్దెల్లో అక్రమాలు జరిగాయన్న అంశంపై ఇటీవల కొందరు విద్యార్థులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా, ఆయన ఆదేశాల మేరకు ట్రెయినీ కలెక్టర్ కళాశాలలో విచారణ నిర్వహించారు. సదరు అధికారి యూనిఫామ్‌లకు సంబంధించి జీఎస్టీ బిల్లులు అడగటంతో బాధ్యులైన వ్యక్తులు ఆగమేఘాల మీద ఓ వస్త్ర దుకాణంలో మెటీరీయల్ కొనుగోలు చేసినట్టుగా దొంగ బిల్లులు తయారుచేయడంతో పాటు రూ.7లక్షల వరకు జీఎస్టీ చెల్లించినట్టుగా బిల్లులు సిద్ధం చేస్తున్నారన్న ప్రచారం లేకపోలేదు.

పరీక్షల ఫీజుల్లోనూ...

ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ డిగ్రీ, పీజీ కళాశాలలో పరీక్షల ఫీజుల రూపంలో కూడా ఇష్టారాజ్యంగా వసూలు చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. రూ. 950 వరకు ఉండే పరీక్ష ఫీజును రూ. 2800 వరకు వసూలు చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎవరైనా ఎదురుతిరిగితే ఇంటర్నల్ మార్కులు తగ్గిస్తామని బెదిరింపులకు పాల్పడటం అక్కడ పనిచేస్తున్న ఉద్యోగులకు పరిపాటిగా మారిందన్న విమర్శలు లేకపోలేదు. పరీక్షల ఫీజుల పేరుతో రూ.60 లక్షల వరకు అదనంగా వసూలు చేసినట్టు ఆరోపణలున్నాయి.

కావాలనే తప్పుడు ఫిర్యాదులు
జాకీరుల్లా, ప్రిన్సిపాల్, ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్

యూనిఫామ్ మెటీరియల్ విషయంలో ఎలాంటి అక్రమాలు జరగలేదు. బయటివ్యక్తులు కళాశాల లోపలికి వచ్చి విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్న సందర్భంలోనే గవర్నింగ్ బాడీలో చర్చించిన తర్వాత యూనిఫామ్ పెట్టాలని నిర్ణయించాం. కొటేషన్లు తీసుకున్న తర్వాత తక్కువ ధరకు ఇచ్చే సరఫరాదారుకి యూనిఫామ్ సరఫరాను అప్పగించాం. విద్యార్థులకు నేరుగా కళాశాల నుంచి ఎలాంటి విక్రయాలు జరగలేదు. పరీక్ష ఫీజులకు సంబంధించి ఎలాంటి ఫిర్యాదులు అందలేదు.

హక్కుల కోసం ఐక్య పోరాటాలు

(3వ పేజీ తరువాయి)

ఇస్లావత్ రామచందర్ నాయక్, సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, బండి రమేష్, పొన్నం వెంకటేశ్వరరావు, తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు అజ్మీరా రామ్మూర్తి, జిల్లా కార్యదర్శి బోడ వీరన్న,సేవాలాల్‌సేన రాష్ట్ర అధ్యక్షుడు బానోత్ కిషన్ నాయక్, హైకోర్టు న్యాయవాది జోగిరామ్‌నాయక్,మాజీ సమాచార శాఖ కమిషనర్ గుగులోత్ శంకర్, తదితరులు పాల్గొన్నారు. కాగా, సమ్మేళనానికి ముందు గిరిజన సంస్కృతి, సాంప్రదాయాలతో భారీ ప్రదర్శన నిర్వహించారు. నగరంలోని పెవిలియన్ గ్రౌండ్‌నుండి భక్తరామదాసు కళాక్షేత్రం వరకు ప్రదర్శన జరిగింది.



గిరిజనుల ప్రదర్శన

సర్వే సిబ్బందికి సహకరించండి

(3వ పేజీ తరువాయి)

పాటు కులం, వృత్తి ఫారంలో అడిగిన అంశాల ఆధారంగా అన్ని అంశాలకు సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. సమాచారంలో తప్పులు లేకుండా ఇవ్వాలి. పూర్తిస్థాయి సమాచారం సర్వేలో ఉంటే ప్రయోజనకరంగా ఉంటుంది.

ప్ర: జిల్లాలో ఎన్ని ఇండ్లు ఉన్నాయి. ఎంతమంది సిబ్బందిని సర్వేలో వినియోగిస్తున్నారు?

జ: జిల్లాలో 6,33,304 ఇండ్లు ఉన్నాయి. వీటి సర్వేనిమిత్తం 314మందిని సూపర్‌వైజర్లను నియమించాం. వీరంతా గెజిటెడ్ అధికారులు, ఏఈలు, అసిస్టెంట్ ఏఈలుతోపాటు పలుశాఖలకు సంబంధించిన వారున్నారు. అలాగే ఎన్యుమరేటర్లను 3719మందిని ఎంపికి చేసి వీరికి శిక్షణ కూడా ఇవ్వడం జరిగింది. వీరు కూడా ప్రభుత్వ ఉద్యోగులు, కొందరు అధికారులు కూడా విధుల్లో ఉన్నారు. కొన్నిచోట్ల ప్రైమరీ ఉపాధ్యాయులను కూడా వినియోగిస్తున్నాం.

ప్ర: సర్వే తరుణంలో అందుబాటులో లేని కుటుంబాలు, దేశంలో ఇతర రాష్ట్రాల్లో,విదేశాల్లో ఉన్న వారి వివరాలు ఎలా తీసుకుంటారు?

జ: ప్రతి బ్లాక్‌కు ఒక ఎన్యుమరేటర్‌ను నియమించాం. వీరు ముందుగానే ఇళ్లను గుర్తించినప్పుడు సంబంధిత ఇంటి వారికి ఫోన్ ద్వారా సర్వే సమాచారం తెలపడం జరుగుతుంది. ఆ కుటుంబంలో ఒకరు వచ్చి సర్వేలో సమాచారం ఇవ్వాలి. ఎక్కడైనా మిస్ అయితే మరొక టీం మిస్ అయిన వారి ఇళ్లను కూడా సర్వే చేయడం జరుగుతుంది. ఒక్కో బ్లాకులో 150నుంచి 200 ఇళ్లున్నాయి. వీరికి ఆ బ్లాకుల్లో ఎన్యుమరేటర్, సూపర్‌వైజర్,స్థానికసిబ్బందితో సర్వే చేయడం జరుగుతుంది.

ప్ర: ఇంటింటి సమగ్ర సర్వే వివరాలను ఎవరికి అందించాలి?

జ: రోజువారిగా వచ్చే సర్వేవివరాలు డేటాను మండలాల్లో డేటా ఎంట్రీ చేయడం జరుగుతుంది. అలాగే మునిసిపల్ కార్పొరేషన్‌లో కూడా డేటా ఎంట్రీద్వారా ప్రభుత్వానికి పంపిస్తాం. ఇందుకు సంబంధించి కూడా ఏర్పాట్లు చేశాం.

ప్ర: మండల, నియోజకవర్గస్థాయి నోడల్ అధికారులు విధులు ఏమిటి?

జ: మండలాల్లో, నియోజకవర్గాల్లో ప్రత్యేక అధికారులను నియమించాం. వీరు క్షేత్రస్థాయిలో సర్వేతీరుపరిశీలిస్తారు అక్కడ తలెత్తే సమస్యలను జిల్లా అధికారుల దృష్టికి తీసుకురావడం జరుగుతుంది. ఫీల్డ్ టీంల మధ్య సమన్వయం చేయడం జరుగుతుంది. అలాగే రోజువారి సర్వే పురోగతిపై కూడా సమీక్ష చేయడం జరుగుతుంది.

ప్ర: సర్వేలోని ప్రధాన అంశాలు ?

జ: కుటుంబ యజమాని, సభ్యుల వ్యక్తిగత వివరాలు, విద్యావివరాలు, ఉద్యోగ, ఉపాధి, భూములు, రిజర్వేషన్ల ప్రయోజనాలు వలస వెళ్లినవారి వివరాలు తీసకోవడం జరుగుతుంది. సామాజిక , ఆర్థిక, రాజకీయ , విద్యా, ఉపాధి, కుల అంశాలను ప్రధానంగా ఈ సర్వేలో గుర్తించడం జరుగుతుంది.

ప్ర: సర్వే సందర్భంగా జిల్లా ప్రజలకు మీ సూచన?

జ: ప్రధానంగా సర్వేలో ఎలాంటి అపోహలకు గురికావద్దు. సర్వే అంతా గోప్యంగా ఉంటుంది. గతంలో ప్రభుత్వం నిర్వహించిన సర్వేలవలే ఈ సర్వే కూడా పకడ్బందీగా,సాఫీగా జరిగేందుకు ఏర్పాట్లుచేశాం. ప్రజలు ఫీల్డ్ సిబ్బందికి సహకరించి సమగ్ర సమాచారం అందించాలి. అవసరమైతే సర్వేలోని అంశాలను ముందుగా తెలుసుకుని అందుకు సంబంధించి వివరాలు తయారు చేసి సిబ్బందికి తెలుపొచ్చు. ప్రజలు సమస్యలు ఏవైనా ఉంటే 1077 టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు.

'తెలంగాణ' రైతులకే బోనస్

- ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రత్యేక అధికారి సురేంద్ర మోహన్

ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రైతులకు మాత్రమే సన్న బియ్యం రకానికి బోనస్ ను అందేలా చూడాలని.. కేంద్రాలకు వచ్చే రైతుల వద్ద నుంచి మద్దతు ధరపై నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రాష్ట్ర గనుల శాఖ కార్యదర్శి, ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రత్యేక అధికారి కె. సురేంద్ర మోహన్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ఆయన జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌తో కలిసి సంబంధిత అధికారులతో ధాన్యం కొనుగోలుపై సమీక్షించారు. ఖమ్మం జిల్లాలో ఈ సీజన్‌కు ధాన్యం కొ నుగోలు ప్రక్రియ కోసం చేపట్టిన చర్యలను కలెక్టర్ వివరించారు. ప్రత్యేక అధికారి కె. సురేంద్ర మోహన్ మాట్లాడుతూ, సన్నరకం ధాన్యం కింద ఏ ధాన్యాన్ని పరిగణిస్తున్నామనే అంశం రైతులకు స్పష్టంగా తెలిసేలా విస్తృత ప్రచారం కల్పించాలన్నారు.

కొనుగోలు కేంద్రాల వద్ద ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు రాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. దొడ్డు వడ్లు, సన్న వడ్లకు తేడాను స్పష్టంగా తెలియజేసేలా కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జి లకు క్షేత్రస్థాయి సిబ్బంది శిక్షణ అందించాలన్నారు. జిల్లాలో మిల్లర్ల నుంచి బ్యాంకు గ్యారెంటీని అండర్ టేకింగ్ అఫిడవిట్ తీసుకొని ధాన్యం అలాట్మెంట్ చేయాలన్నారు. రైస్ మిల్లుల వద్ద ఎక్కడ తాలు పేరుతో కోతలు పెట్టవద్దన్నారు. సన్న రకం ధాన్యంపై ప్రభుత్వం ప్రకటించిన రూ.500 రూపాయల బోనస్ తెలంగాణ రైతులకు మాత్రమే అందాలన్నారు. ఖమ్మం జిల్లా సరిహద్దు ప్రాంతం ఆంధ్రప్రదేశ్ నుంచి ఎటువంటి ధాన్యం మన జిల్లాకు రాకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని అన్నారు.

జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ, ఖమ్మం జిల్లాలో రెండు లక్షల మెట్రిక్ టన్నుల (1.3 లక్షల సన్న రకం, 70 వేల దొడ్డు రకం) ధాన్యం కొనుగోలు అంచనాతో ఏర్పాట్లు చేశామన్నారు. గతంలో ఖమ్మం జిల్లాలో 236 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఉంటే ప్రస్తుతం 323 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. డీసీఎంఎస్ ద్వారా 27, డీఆర్డీఏ ద్వారా 138, పీఏసీఎస్ ద్వారా 158 కేంద్రాల ఏర్పాటు చేసినట్లుతెలిపారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో అవసరమైన వేయింగ్ యంత్రాలు, తేమ యంత్రాలు, మౌలిక వసతులు కల్పించామన్నారు.

జిల్లా సరిహద్దులో ఏపీనుంచి ధాన్యం రాకుండా 14 చెక్ పోస్ట్ లను అప్రమత్తం చేశామని, వ్యవసాయ, రెవెన్యూ, పోలీస్ అధికారులు 24 గంటలపాటు చెక్ పోస్ట్ వద్ద ఉండేలా చర్యలుతీసుకున్నామని అన్నారు. 1077 టోల్ ఫ్రీ నెంబర్‌తో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు.

ఈ సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్ పి.శ్రీజ, పి. శ్రీనివాస్ రెడ్డి, ట్రైనీ కలెక్టర్ మృణాళ్ శ్రేష్ఠ, డీఆర్డీవో సన్యాసయ్య, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పుల్లయ్య, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి అలీమ్, జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్ కుమార్,పాల్గొన్నారు.

శ్రీరామయంత్ర రథానికి భద్రాద్రి రామాలయ మర్యాద

సమర్పించిన దేవస్థానం ఈవో, వైదిక పరిపాలనాధికారులు



రథం వద్ద దేవస్థానం వైదిక పరిపాలన అధికారులు

భద్రాచలం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): అయోధ్యలో ప్రతిష్ఠించనున్న శ్రీరామ యంత్రాన్ని తీసుకొస్తున్న రథానికి భద్రాచలంలో మంగళవారం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం ఆలయ మర్యాదను సమర్పించింది. దేవస్థానం ఈవో ఎల్. రమాదేవి, ప్రధాన అర్చకులు అమరవాది విజయరాఘవన్, వైదిక పరిపాలనాధికారులు మేళతాళాలతో వెళ్లి స్వామి వారి శేష వస్త్రం, శేష మాలిక, ప్రసాదం మర్యాదగా అందజేశారు. అనంతరం కంచిపీఠం తరపున ఈవోను వారు సత్కరించారు. 180 కిలోల పంచలోహాలు, బంగారుపూతతో శ్రీరామ మహాయంత్రం తయారు చేయగా తిరుపతి నుంచి అయోధ్యకు ఐదు రాష్ట్రాల మీదుగా రథ యాత్ర ప్రారంభమైంది. ఈ క్రమంలో భద్రాచలం చేరుకోగా శృంగేరిపీఠానికి అనుబంధమైన అంబాసత్రం నిర్వాహకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం అధిక సంఖ్యలో భక్తులు శ్రీరామ యంత్రాన్ని దర్శించారు.

శ్రీరామయంత్రంతో ఉన్న ఈ రథం ఈనెల 16న అయోధ్యకు చేరుకోనుంది. అనంతరం శ్రీరామ మహానారాయణ దివ్యరుద్ర సహిత శత సహస్ర చండీ విశ్వశాంతి మహాయాగం 45 రోజుల పాటు నిర్వహించనుండగా ఇందులో 1200 మంది రిత్వికులు పాల్గొననున్నారు. ఈ క్రమంలో లక్ష చండీయాగాలు నిర్వహించనున్నారు. అనంతరం శ్రీరామ యంత్రాన్ని అయోధ్యలో ప్రతిష్ఠించనున్నారు.

ఈ కార్యక్రమంలో భద్రాద్రి దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి, భద్రాద్రి దేవస్థానం విశ్రాంత ఈవో వేగేశ్న రామకృష్ణంరాజు, ప్రధాన అర్చకులు అమరవాది విజయరాఘవన్, ఉప ప్రధాన అర్చకులు కోటి రామస్వరూప్ రాఘవాచార్య వేద పండితులు ద్వివేదుల సత్యసాయి సన్యాసి శర్మ, గుదిమెళ్ల మురళీకృష్ణమాచార్యులు, శ్రీరామయణపారాయణదారులు ఎస్టీజీ అంతర్వేది కృష్ణమాచార్యులు, అంబాసత్రం మేనేజరు నరసింహమూర్తి, అర్చకులు యామజాల శశికాంత్ శర్మ పాల్గొన్నారు.

మార్కెట్‌లోనే సీసీఐ కేంద్రం ఏర్పాటు చేయాలి

- బీఆర్ఎస్ నాయకుల డిమాండ్

ఖమ్మం మార్కెట్ నవంబరు 5(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ ఆధ్వర్యంలో నాయకులు ఆందోళన నిర్వహించారు. మంగళవారం వ్యవసాయ మార్కెట్ సందర్శనకు వచ్చిన వారు అకాల వర్షాలతో నష్టపోయిన పత్తి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఎక్కడో జిన్నింగ్ మిల్లులకు అనుకూలంగా సుదూర ప్రాంతాలలో ఏర్పాటు చేసిన సీసీఐ కొనుగోలు కేంద్రాలలో రైతుల పత్తిని తేమ శాతం కొర్రీలతో కొనుగోలు చేయని కారణంగా వారు ప్రైవేటు వ్యాపారులకు తక్కువ ధరలకు అమ్ముకోవాల్సి వస్తుందని, దీంతో పత్తి రైతులు తీవ్రంగా నష్ట పోతున్నారని వారు ఆరోపించారు. ఈ సంవత్సరం అతివృష్టి వల్ల అరకొరగా దిగుబడి వచ్చిన పత్తి ఎమ్మెస్పీ ధర క్వింటాలుకు రూ.7,520 ల కన్నా అదనంగా రూ. 1,000లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మార్కెట్ యార్డులో తిరుగుతూ పత్తి కొనుగోళ్లను పరిశీలించారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య, జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ గుండాల క్రిష్ణ, నాయకులు సామినేని హరిప్రసాద్, బెల్లం వేణుగోపాల్, ఉన్నం బ్రహ్మయ్య, వీరునాయక్, వీరన్న, మాటేటి నాగేశ్వరరావు, తోట వీరభద్రం,తదితరులు ఉన్నారు.

పత్తిని మద్దతు ధరకు కొనుగోలు చేయాలి

- వ్యవసాయ మార్కెట్‌లో ఆందోళన

ఖమ్మం మార్కెట్ నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కొర్రీలు లేకుండా రైతులు పండించిన పత్తిని మద్దతు ధరకు కొనుగోలు చేయాలని కోరుతూ సీపీఐ, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో ఆందోళన నిర్వహించారు. ఈ సంవత్సరం వాతావరణ మార్పులతో రైతులు పండించిన పత్తి అరకొరగా దిగుబడి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. సీసీఐ కొనుగోలు కేంద్రాలలో పత్తిని నిబంధనల పేర కొర్రీలు పెడుతూ కొనుగోలు చేయట్లేదని, ఇదే అదునుగా ప్రైవేటు వ్యాపారులు తక్కువ ధరలకు అందినకాడికి రైతుల కష్టాన్ని దోచుకుంటున్నారని వారు పేర్కొన్నారు. ఈ-నామ్ కార్యాలయం, మార్కెట్ గేట్ల వద్ద పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించి, మార్కెట్‌లో కాంటాలను అడ్డుకున్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర నాయకులు బాగం హేమంతరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, నాయకులు మహ్మద్ మౌలానా, యర్రా బాబు, రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు దొండపాటి రమేష్, కొండపర్తి గోవిందరావు, రామకోటయ్య, కళావతి, సీతామహాలక్ష్మి, రామ్మూర్తి, మల్లేష్, శ్రీనివాసరావు, ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వీ పాటిల్

సమాజానికిఉపయోగపడే ప్రాజెక్టులు రూపొందించాలి

» భద్రాద్రి కలెక్టర్ జితేష్ వీపాటిల్

కొత్తగూడెం, నవంబరు5 (ఆంధ్రజ్యోతి): సమాజానికి, రైతులకు ఉపయోగపడే ప్రాజెక్టులు రూపొందించాలని భద్రాద్రి కలెక్టర్ జితేష్ వీపాటిల్ అన్నారు. మంగళవారం పాత కొత్తగూడెంలోని జిల్లా విద్యాశిక్షణ కేంద్రంలో శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈనెల 18, 19, 20 తేదీల్లో అన్నపురెడ్డిపల్లిలో జరిగే జిల్లా వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థులు సమాజానికి, రైతులకు ఉపయోగపడే ప్రాజెక్టులను రూపొందించే విధంగా ఉపాధ్యాయులు సూచనలు చేయాలని చెప్పారు. వైజ్ఞానిక ప్రదర్శన కేవలం అలంకరణకు కాక దాని ద్వారా విద్యార్థులు గుణాత్మక వ్యవసాయ వేత్తలుగా, శాస్త్రవేత్తలుగా తయారయ్యేట్టుగా ప్రోత్సహించాలన్నారు. ప్రదర్శనలోని ఉపఅంశాలైన ఆహారం, ఆరోగ్యం, పరిశుభ్రత, గణిత నమూనాలు, వ్యర్థాల నిర్వహణ, వనరుల నిర్వహణ, సహజ వ్యవసాయం, రవాణా, సమాచార వ్యవస్థ, విపత్తు నిర్వహణ, ప్రకృతి పరిరక్షణ అనే అంశాలను వివరిస్తూ వాటిలో ఎటువంటి ప్రాజెక్టులు రూపకల్పన చేయొచ్చు అనే అంశాలను విశదీకరించారు. జిల్లాలో ప్రత్యేకంగా చేపట్టిన మునగ సాగు వర్షపు నీటిగుంటల ఏర్పాటు, సంప్రదాయ నిర్మాణ పద్ధతులు వివరిస్తూ వీటిలో ఉపాధ్యాయులు ఆలోచనాత్మకమైన ప్రాజెక్టులను సిద్ధం చేసి విద్యార్థులను భావిభారత శాస్త్రవేత్తలుగా ఎదిగే విధంగా చేయాలని జితేష్ వీపాటిల్ సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈవో ఎం. వెంకటేశ్వరాచారి, జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి నాగరాజశేఖర్, జిల్లా సైన్స్అధికారి చలపతిరాజు, రీసోర్స్ పర్సన్స్ సంపత్‌కుమార్, చంద్రశేఖర్, జిల్లాలోని అన్ని పాఠశాలల సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బోధనకు ఇబ్బంది లేకుండా కులగణన నిర్వహించాలి

ఖమ్మంఖానాపురంహవేలినవంబరు5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల బోధనకు ఇబ్బంది కలగకుండా కులగణన నిర్వహించాలని, పెండింగ్ బిల్లులు, డీఏలను వెంటనే విడుదల చేయాలని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పర్వత రెడ్డి అన్నారు. మంగళవారం నగరంలోని సంఘం భవన్‌లో నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో మాట్లడారు. సర్వేలో ప్రాథమిక పాఠశాలలోని ఉపాధ్యాయులకు విధులు కేటాయించటం పట్ల విద్యార్థులకు నష్టం వాటిల్లుతుందన్నారు. ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులకు సర్వేలో భాగస్వామ్యం చేయాలని కోరారు.

ఉపాధ్యాయులు ఓటు నమోదు చేసుకోవాలి

ఎమ్మెల్సీ అభ్యర్థి వెంకటస్వామి

ఖమ్మంఖానాపురంహవేలి నవంబరు5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రతీ ఉపాధ్యాయుడు ఫిబ్రవరిలో జరగబోవు శాసనమండలి ఎన్నికలకు ఓటు నమోదు చేసుకోవాలని డాక్టర్ కొలిపాక వెంకటస్వామి అన్నారు. ఖమ్మం నల్గొండ, వరంగల్ జిల్లాలో జరగబోవు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నమోదులో భాగంగా నగరంలోని కేజీబీవీ, మెడికల్ కాలేజీ, పలు పాఠశాలను సందర్శించారు. ఓటరు నమోదులో భాగంగా ఎమ్మెల్సీ అభ్యర్థి వెంకటస్వామి సందర్శించారు.

పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా హరిప్రసాద్

ఖమ్మంఖానాపురంహవేలి నవంబరు5(ఆంధ్రజ్యోతి): పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా నగరంలోని ఇందిరానగర్ పాఠశాలలో స్కూల్‌అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న గొర్రెపాటి హరిప్రసాద్‌ను నియమించారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గార్లపాటి ఉమాకర్‌రెడ్డి ఈ వివరాలు వెల్లడించారు. ఎంపికైన హరిప్రసాద్‌ను పలువురు అభినందించారు.

కల్లూరు మునిసిపాలిటీ అయ్యేనా!?

» గతంలో ప్రభుత్వానికి ప్రతిపాదనలు
» అన్ని అర్హతలు ఉన్న మేజర్ పంచాయతీ
» ఈ ప్రభుత్వంలోనైనా మోక్షం కలుగుతుందా?



కల్లూరు,నవంబరు5(ఆంధ్రజ్యోతి): కల్లూరు మేజర్ గ్రామపంచాయతీకి భౌగోళికంగా, సామాజికంగా, ఆర్థికంగా ఇతరత్రా మునిసిపాలిటీగా ఎదిగేందుకు అన్ని అర్హతలు ఉన్నాయి. గత ప్రభుత్వం అధికారంలో ఉండగా అప్పటిలో పంచాయతీ పాలకవర్గ సభ్యులు కూడా తీర్మానం చేశారు. మునిసిపాలిటీగా ఉన్న ప్రాధన్యంపై మండల స్థాయిలో అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు కూడ పంపారు. కాని నాటి నుంచి నేటివరకు ఈ విషయమై పాలకులు, ఉన్నత అధికారులు దృష్టి సారించలేదు.

అప్‌గ్రేడ్‌కు అవకాశం..

రాష్ట్రంలోనే కల్లూరు మేజర్ గ్రామ పంచాయతీల్లో పెద్దది. ఇక్కడ జనాభా 22వేలకు పైగా ఉండగా, ఓటర్లు 12,677 మంది ఉన్నారు. ఈ పంచాయితీ పరిధిలో కల్లూరుతో పాటుగా గోపాలదేవబోయినపల్లి, ఖాన్‌ఖాన్‌పేట, శ్రీరాంపురం గ్రామాలు విస్తరించి ఉన్నాయి. రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ఉన్న కల్లూరు ఏపీ, తెలంగాణ రాష్ట్రాల సరిహద్దున కూడలి ప్రాంతంగా ఉంది. ఇటు వ్యవసాయం రంగంతోపాటుగా వ్యాపార, వాణిజ్య, ఆదాయపరంగా ప్రాధాన్యం సంతరించుకుంది. 2018 పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం కల్లూరు పట్టణం పురపాలకంగా అప్‌గ్రేడ్ చేసేందుకు అవకాశం ఉంది. ఏడాదికి గాను ఇప్పటికే రూ.1.50 కోట్లకు పైగా ఆదాయం సమకూరింది.

అసెంబ్లీ సెగ్మెంట్‌గా...

గత ప్రభుత్వంలో పాలకులు కల్లూరు పంచాయతీని మునిసిపాలిటీగా చేసే విషయమై దృష్టి సారిస్తున్న తరుణంలోనే అసెంబ్లీ ఎన్నికలు రావటంతో అంతిమంగా ఈ అంశం మరుగున పడింది. భవిష్యత్తులో రాష్ట్రంలో నియోజకవర్గాల పునర్విభజన జరిగితే కల్లూరు నియోజక వర్గంగా మారే అవకాశం కూడా రాష్ట్ర ప్రభుత్వ పరిశీలినలో ఉంది. కల్లూరు మేజర్ గ్రామ పంచాయతీకి మునిసిపాలిటీగా మారేందుకు ఇన్ని అవకాశాలు ఉన్నందున పాలకులు, ఉన్నత అధికారులు ఇప్పటికైన దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. కల్లూరు మండలంలోని నారాయణపురానికి చెందిన పొంగులేటి శ్రీనివాసరెడ్డి కూడా ఈ ప్రాంతానికి చెందిన వారే. సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి కూడా కల్లూరు మునిసిపాలిటీగా మారేందుకు తగిన విధంగా కృషి చేయాల్సిన అవసరం ఉంది.

పురపాలకంగా అన్ని అర్హతలు
ఎన్. నాగేశ్వరరావు, పంచాయితీ కార్యదర్శి



కల్లూరు మేజర్ గ్రామపంచాయతీకి పురపాలకంగా మారేందుకు అన్ని అవకాశాలు ఉన్నాయి. రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ఉంది. పలు ప్రాంతాలకు కూడలిగా విస్తరించింది. భౌగోళికంగా, చారిత్రకంగా కూడా ప్రాధాన్యం సంతరించుకుంది. జనాభా 22 వేలకు పైగా ఉన్నారు. ఆదాయంలో కూడ ముందజలో ఉంది.

కల్లూరు అభివృద్ధికి మార్గం...
దోసపాటి భాస్కరరావు, కల్లూరు



కల్లూరు మునిసిపాలిటీగా మారితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి మరింతగా నిధులు వస్తాయి. అభివృద్ధి మరింతగా జరుగుతుంది. గతంలో కల్లూరు మేజర్ పంచాయతీ మునిసిపాలిటీగా మారాల్సి ఉంది. పాలకులు సరియైన విధంగా దృష్టి సారించనందున ఈ అంశం మరుగున పడింది. ఇప్పటికే రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ఉన్న కల్లూరు చారిత్రకంగా ఎంతో ప్రాధాన్యం కలిగి ఉంది. భవిష్యత్తులో నియో.జకవర్గంగా కల్లూరు మారే అవకాశాలు ఉన్నాయి. ప్రజలు కూడా మునిసిపాలిటీగా చేయాలని ఎదురు చూస్తున్నారు.

కేయూ క్రీడల్లో మెరిసిన సింగరేణి విద్యార్థినులు

» అభినందించిన సింగరేణి ఎడ్యుకేషన్ సొసైటీ సెక్రటరీ గుండా

కొత్తగూడెంపోస్టాఫీస్‌సెంటర్,నవంబరు5(ఆంధ్రజ్యోతి): ఇటీవల ఖమ్మంలో జరిగిన కాకతీయ యూనివర్సిటీస్థాయి టోర్నమెంట్‌లో కొత్తగూడెం సింగరేణి డిగ్రీ మహిళా కళాశాల విద్యార్థినులుఅత్యుత్తమ ప్రదర్శన కనబరిచారు. ఐదుగురు పతకాలు సాధించగా మంగళవారం కళాశాలలో నిర్వహించిన అభినందన సభలో ప్రిన్సిపాల్ సీహెచ్.శారద, సింగరేణి ఎడ్యుకేషన్ సొసైటీ సెక్రటరీ గుండా శ్రీనివాస్ అభినందించారు. బీకాం చదువుతున్న ఇందు 1500 మీటర్ల పరుగు పందెం, 500మీటర్ల పరుగు పందెంలో బంగారు పతకాన్ని సాధించారు. బీకాం రెండో ఏడాదిచదివే సింధూ 400మీటర్ల పరుగుపందెం,లాంగ్‌జంప్‌లో మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకాన్ని కైవసం చేసుకుంది. బీకాం రెండోఏడాది చదువుతున్న ఎ.వందన డిస్కస్‌త్రో, షార్ట్‌పుట్ విభాగాల్లో బంగారు పతకాన్ని సాధించింది. బీఎస్సీ మూడోఏడాది చదువుతున్న జి.రేణుకా హైమర్‌త్రోలో బంగారు పతకాన్ని సాధించింది. బీజెడ్‌సీ మొదటి సంవత్సరం చదువుతున్న ఎం.సంగీత 10వేలమీటర్లు, 5వేలమీటర్లు పరుగు పందెంలో నాల్గావ స్థానంలో నిలిచింది. 400 మీటర్ల రిలే విభాగంలో సింధూ, ఇందు, వందన, సంగీత జట్టు బంగారు పతకం సాధించించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరెస్పాండెంట్ కె.సునిల్‌కుమార్, పీడీ కె.సావిత్రి పాల్గొన్నారు.



పతకాలు సాధించిన విద్యార్థినులతో శ్రీనివాస్

రేపు భద్రాద్రి జిల్లాలో జాబ్ మేళా

చుంచుపల్లి, నవంబరు5 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి జిల్లాలోని నిరుద్యోగ అభ్యర్థులకు ఉపాధి కల్పించే ఉద్దేశంలో భాగంగా జాబ్ మేళాను గురువారం నిర్వహిస్తున్నామని జిల్లా ఉపాధి కల్పన అధికారి శ్రీరామ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదారాబాద్ మేడ్చల్‌లోని కే.ఎల్ గ్రూప్స్ చెందిన వేరేహౌస్ అసోసియేటెడ్, సెక్యూరిటీ సూపర్వైజర్స్, మేల్ అండ్ ఫిమేల్ గార్డ్స్, రిసెప్షన్ లిస్ట్ వంటి నాలుగు కేటగిరిలో 250 పోస్టుల భర్తీకి ఈ జాబ్ మేళాను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పదోతరగతి నుంచి డిగ్రీ వరకు విద్యార్హతగా నిర్ణయించామన్నారు. వయస్సు 18 నుంచి 35 సంవత్సరాలు ఉండాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఉదయం చుంచుపల్లి మండల పరిషత్ కార్యాలయంలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 7730820444లో సంప్రదించాలని కోరారు.

కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ అప్పారావు

ఖమ్మంఖానాపురంహవేలి, నవంబరు5 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 11 మాసాలైనా ఇంతవరకు ఆర్టీసీకి ఇచ్చిన హామీలు పూర్తిగా అమలు చేయలేదని, హామీలను వెంటనే నెరవేర్చాలని ఆర్టీసీ రాష్ట్ర జేఏసీ నాయకుడు, ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ పాటి అప్పారావు, ఎంప్లాయిస్ యూనియన్ రీజియన్ కార్యదర్శి పిల్లి రమేష్ అన్నారు. ఉద్యమాల్లో భాగంగా కలెక్టర్ రాష్ట్రవ్యాప్తంగా అందరికీ వినతిపత్రం సమర్పించడంలో భాగంలో మంగళవారం కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్‌కి వినతిపత్రం సమర్పించారు. ఆర్టీసీ కార్మికుల సమస్యల్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి ఆర్టీసీ కార్మికుల న్యాయం చేయాలని కోరారు.



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఏఈవోల సహాయ నిరాకరణ

» డిజిటల్ క్రాప్ సర్వే చేయలేమని స్పష్టికరణ » సర్వేలో పాల్గొంటున్న 9మంది కాంట్రాక్ట్ ఏఈవోలు

కొత్తగూడెంఅర్బన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): పాలకప్రభుత్వాలు అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న డిజిటల్ సర్వేకు అధికారులు అశించిన మేర లక్ష్యాలను చేరుకొవడంలో నత్తతో పోటీ పడుతుంది. వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈవోలు) ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారంలో నిర్లక్ష్యం వెరసి సర్వే చే సేందుకు ఆశక్తి కనబర్చడం లేదు. వ్యవసాయ ఉన్నతాధికారుల ఒత్తిడి మేరకు సర్వే చేసేందుకు తొలుత సుముఖత వ్యక్తం చేసినప్పటికీ.. ప్రధాన సమస్యలు పరిష్కరించకుండానే సర్వే పూర్తి చేయాలని హుకుం జారీ చేశారని ఏఈవోలు చెబుతున్నారు. రైతులు సాగు చేసిన పంటల వివరాలు నమోదుకు ప్రభుత్వం చేపట్టిన డిజిటల్ క్రాప్ సర్వేకు ఏఈఓలు సిద్ధం అయ్యారు. ఆధునిక సాంకేతికతను వినియోగి స్తూ.. వ్యవసాయ సామార్థ్యాలను పెంపొందించి రైతులకు ప్రయోజనాలు అందిచేందుకు ఈ సర్వే నిర్వహిస్తున్నారు. క్షేత్రస్థాయికి వెళ్లి సర్వే నెంబర్ల వారీగా పంటల వివరాలను నమోదు చేయడం, పంటల కొనుగోలు, ఎగుమతులు, మార్కెటింగ్, ప్రకృతి వైపరీత్యాలతో జరిగిన నష్టాలను అంచనా వేసేందుకు డిజిటల్ క్రాప్ సర్వే సహాయపడనుంది.

ఏఈఓలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు ఇవే..

రైతులు సాగుచేస్తున్న పంటల వద్ద వ్యవసాయ విస్తరణ అధికారులు డిజిటల్ క్రాప్ సర్వే చేస్తున్న క్రమంలో నెట్‌వర్క్, యాప్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. ఒక ఏఈవోకు ఐదు వేల ఎకరాలను కేటాయించాల్సిన ప్రభుత్వం 10నుంచి 20వేల ఎకరాలకు ఒక ఏఈవోను నియమించింది. సర్వే నెంబర్‌లోని సబ్ డివిజన్లను తప్పనిసరిగా నమోదు చేయాలి. యాప్‌లో మ్యాపింగ్ చేసిన సర్వే నెంబర్లకు ఫీల్డ్‌లో ఉన్న సర్వే నెంబర్లకు పొంతన లేకపోవడం, సర్వే నెంబర్లు మ్యాపింగ్‌తో వెళ్లిన ఏఈవోలకు వ్యవసాయ భూములకు బదులుగా పోలీస్ హెడ్ క్వాటర్లు, ఇతర రైతుల పంటపొలాలు దర్శనమివ్వడం లాంటి విపత్కర పరిస్థితులు నెలకొంటున్నాయి. డిజిటల్ క్రాప్ సర్వేకు ప్రభుత్వం ప్రతి ఏఈవోకు ఒక ట్యాబ్ ఇవ్వాల్సి ఉంది. కానీ ప్రభుత్వం నుంచి ట్యాబ్‌లు ఇవ్వకపోవడంతో ఏఈవోలు వారి వద్ద ఉన్న సొంత పోన్లలోనే వివరాలు నమోదు చేస్తున్నారు. దీంతో చాలా పోన్లలో సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. వివరాలు అప్‌లోడ్ కాక ఏఈవోలు ఇబ్బందులు పడుతున్నారు. డీసీఎస్ యాప్‌లో పంట నమోదు చేసే క్రమంలో మొబైల్ హీట్ ఎక్కి ఆగిపోతుండడం జరుగుతుంది. కడాస్ట్రల్ మ్యాప్‌లు లేని గ్రామాల్లో సర్వే నెంబర్లు, సబ్ డివిజన్ల మార్కింగ్ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని చెబుతున్నారు. సర్వే నెంబర్లు వారీగా ఫీల్డ్ విజిట్‌కి వెళ్లిన ఏఈవోలకు సబ్ డివిజన్ నెంబర్లు యాప్‌లో కానరావడం లేదని పేర్కొంటున్నారు. రైతులు లేకుండా పంట పొలాలకు వెళ్లి సబ్ డివిజన్లు తెలుసుకోవడం లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోతున్నారు. మహిళా ఏఈవోలు సహాయకులు లేకుండా ఒంటరిగా సర్వే చేయడంలో ఇబ్బందులు పడుతున్నామని చెబుతున్నారు. అటవీ ప్రాంతాల్లో సెల్ పోన్ సిగ్నల్ ్స లేకపోవడం, నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లో డీసీఎస్ సర్వే చేయలేమని అధికారులకు మొరపెట్టుకుంటున్నారు.



రేగులగూడెం గ్రామంలో సర్వే నిర్వహిస్తున్న దృశ్యం(ఫైల్)

సర్వే చేయలేమని 58 ఏఈవోల దూరం

జిల్లాలో 6లక్షల37వేల ఎకరాలు వ్యవసాయ భూమిలో పట్టాలు లేని భూములు, పోడు వ్యవసాయంలో పట్టాలు లేని భూములు ఉన్నాయి. 5వేల ఎకరాలకు ఒక ఏఈవో చొప్పున 128మంది ఏఈవోలకు 58మంది రెగ్యులర్ ఏఈవోలు, 9మంది కాంట్రాక్ట్ ఏఈవోలతో కలిపి 67మంది మాత్రమే ఉన్నారు. ఈ సర్వే వివరాలు ట్యాబ్‌లోని యాప్‌లో నమోదు చేయాల్సిఉంది. 2017లో ఏఈవోలకు ఇచ్చిన ట్యాబ్‌లు సక్రమంగా పనిచేయకపోవడంతో అధికారులకు రిటన్ చేశారు. ఏఈవోలు తమ సొంత పోన్లలోనే సర్వే చేస్తున్నామని తెలిపారు.

జిల్లాలో అత్యధికంగా కొమారారం కల్బర్‌లో 29,300 ఎకరాల విస్తీర్ణంలో సర్వే చేయాల్సి ఉందని, 58మంది రెగ్యులర్ ఏఈవోలు సమస్యలు పరిష్కారం కోసం క్రాప్ సర్వేలో సహాయ నిరాకరణ చేస్తున్నారని, కాంట్రాక్ట్ ఏఈవోలు మాత్రమే డిజిటల్ క్రాప్ సర్వే చేస్తున్నారని, ఏఈవోల సంఘం జేఏసీ నాయకులు నర్సింహారావు తెలిపారు.

చోరీకి పాల్పడిన దొంగల అరెస్ట్

గుండాల, నవంబరు 5: మండల కేంద్రంలో వారం రోజుల క్రితం ఓ నగల దుకాణంలో చోరీకి పాల్పడిన ముగ్గురు వ్యక్తులను గుండాల పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళవారం గుండాల పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ రవీందర్, ఎస్ఐ రాజమౌళిలు చోరీ వివరాలను వెల్లడించారు. ఆంధ్రప్రదేష్ రాష్ట్రం విజయవాడకు చెందిన మలపోలు శివ నాగ మహేష్, బొమ్మిడి సాయి కుమార్, కాకినాడ శ్రీనివాస చారీతో పాటు మరో ప్రధాన నిందితుడు(ప్రస్తుతం పరారీలో ఉన్నాడు) ఈ నలుగురు కలసి ఈ చోరీ కేసులో ఉన్నట్లు తెలిపారు. గతనెల 29 తేదీ అర్థరాత్రి ఓ ఆటోలో వచ్చిన ఆ నలుగురు వ్యక్తులు స్థానిక మణికంఠ జ్యూయలరీ షాపులో, రామాలయంలో చోరీకి పాల్పడినట్లు తెలిపారు. నగల దుకాణంలో కిలో వెండి, కొంత బంగారం దొంగలించారు. దుకాణ యజమానుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా ఇల్లెందు, గుండాల పరిసర ప్రాంతాలలో సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి మంగళవారం మరో చోరీకి ప్రయత్నం చేస్తున్న క్రమంలో ముత్తాపురం గ్రామంలో ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. నేరానికి ఉపయోగించిన ఆటోను స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. ప్రధాన నిందితుడు పరారీలో ఉన్నాడని, అతని వద్దనే దొంగిలించబడిన నగలు ఉన్నాయని విచారణలో తెలిందన్నారు. వారం రోజుల్లో కేసు చేధించిన ఎస్ఐ రాజమౌళి, సిబ్బందిని ఇల్లెందు డీఎస్పీ చంద్రబాను అభినందించారు. .

మనస్తాపానికి గురై వివాహిత ఆత్మహత్య

అశ్వారావుపేట, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మనస్తాపానికి గురై వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని మొద్దులగూడెంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మొడియం లక్ష్మి(29)కు మొద్దులగూడెం గ్రామానికి చెందిన వెంకటేశ్వరరావుతో 10 ఏళ్ల క్రితం వివాహమైంది. కాగా వెంకటేశ్వరావు మద్యానికి బానిసై తరచూ మద్యం తాగి వచ్చి భార్యతో ఘర్షణపడుతున్నాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి కూడా భార్య, భర్తలు ఘర్షణ పడ్డారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఆమె సోమవారం రాత్రి అందరూ నిద్రించిన తరువాత ఇంటి ఎదురుగా ఉన్న చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మంగళవారం ఉదయం సంఘటనను చూసి న గ్రామస్థులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతురాలి తల్లి కోర్స బుచ్చమ్మ ఫిర్యాదు మేరకు ఎస్ఐ యతిరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

రామవరంలో యువకుడు...

చుంచుపల్లి, నవంబరు5(ఆంధ్రజ్యోతి): ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన కొత్తగూడెం టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని చిట్టి రామవరం ప్రాంతానికి చెందిన శ్రీనివాస్ మిషన్ పనులు చేసుకుంటూ భార్య, ఇద్దరు కుమారులతో జీవిస్తున్నాడు. ఈ క్రమం లో చిన్న కుమారుడు అజ్మీరా శివ(23) ఓ ఆన్‌లైన్ డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాడు. ప్రస్తు తం ఆ పనిని మానేసి ఇంట్లోనే ఖాళీగా ఉంటున్నాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని కొత్తగూడెం మార్చురీకి తరలించారు. మృతికి గల కారణాలపై విచారణ చేస్తున్నామని, తల్లిదండ్రులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు.

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

బోనకల్, నవంబరు5(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మోటమర్రి రైల్వే స్టేషన్ సమీపంలో మంగళవారం రైలు నుంచి పడిన గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. మధిర, మోటమర్రి రైల్వే స్టేషన్ల మధ్య కిలోమీటర్ నంబర్ 524/24-26 దిగువ మెయిన్ లైన్ రైలు పట్టాల పై 25 ఏళ్ల వ్యక్తి మృతి చెంది ఉన్నాడు. రైలు నుంచి జారీ పడి మృతి చెందినట్లు పలువురు భావిస్తున్నారు. అతడి వద్ద ఎలాంటి గుర్తింపు కార్డులు లభించలేదు. మృతుడు మెరూన్ కలర్ షర్టు, నీలం రంగు జీన్స్ ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని మధిర ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ సంఘటన పై ఖమ్మం జీఆర్పీ ఎస్ఐ భాస్కరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

ఆర్మీ జవాన్ సాయిచందర్‌కు నివాళి

భద్రాచలం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): అస్సాంలోని ఠాకూర్‌బరి రంగపురలో జరిగిన ఏనుగుల దాడిలో ఆర్మీలో నాయబ్ సుబేదార్‌గా పని చేస్తున్న భద్రాచలానికి చెందిన కొంగా సాయిచందర్ ఆదివారం సాయంత్రం మృతి చెందిన సంగతి విధితమే. మంగళవారం ఆయన మృతదేహాన్ని ఆర్మీ అధికారులు ప్రత్యేక వాహనంలో హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి తీసుకువచ్చారు. పలువురు ఆర్మీ అధికారులు, నాయకులు జవాన్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కాగా సాయిచందర్‌రావు 2001లో భారత సైన్యంలో చేరగా దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో ఇప్పటి వరకు పని చేశారు. ఈ ఏడాది డిసెంబరు 6తో ఒప్పందకాలం 24 ఏళ్ల పూర్తికానుండటంతో ఉద్యోగ విరమణ చేయనున్నారు. వరంగల్ ఎన్సీసీ కల్నల్, పట్టణ సీఐ సంజీవరావు, ఎస్ఐ మధుప్రసాద్, పోలీసు సిబ్బంది జాతీయ పతాకాన్ని ఉంచి నివాళులర్పించారు. సాయిచందర్ నివాసంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కాగా సాయిచందర్‌రావుకు భార్య స్రవంతి, ఒక బాబు, పాప ఉన్నారు.



సాయిచందర్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు

'రూ.40లక్షల నష్ట పరిహారం అందించాలి'



మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజేశ్వరి

ఏన్కూరు, నవంబరు5(ఆంధ్రజ్యోతి): సీతారామ ఏన్కూరు లింక్‌కెనాల్ కింద భూములు కోల్పోయిన రైతులకు ఎకరానికి రూ.30నుంచి 40లక్షల నష్ట పరిహారం చెల్లించాలని రైతులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక రైతువేదికలో భూములు కోల్పోయిన రైతులతో నిర్వహించిన సమావేశంలో అధికారుల ముందు రైతులు తమ గోడును వెళ్లబుచ్చారు. కాల్వ పనులు మొదలై దాదాపుగా 8నెలలు గడుస్తున్నా ఇంత వరకు నష్టపరిహారం చెల్లించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు చెరువు కింద బ్రిడ్జిలు ఏర్పాటు చేయడం వల్ల పంట పొలాలు ఎండి పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. లింక్ కెనాల్ నిర్మాణంలో భూములు కోల్పోయని రైతులకు ఎకరానికి రూ.30నుంచి 40లక్షల పరిహారం చెల్లించాలన్నారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజేశ్వరికి రైతులు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ భూములు కోల్పోయిన రైతులకు న్యాయం జరిగే విధంగా కృషిచేస్తానన్నారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ సీహెచ్ శేషగిరిరావు, సీతారామ ప్రాజెక్టు డీఈ చంద్రశేఖర్, సాగర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రోహిత్, నవీన్‌శర్మ, ఫారెస్టు అధికారులు, ఆర్ఐ నవీన్, రెవెన్యూ సిబ్బంది రైతులు శోభన్‌నాయక్, మేడ ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.



రైతుబజార్ కూరగాయల ధరలు

(కిలో ఒక్కంటికి రూపాయల్లో)

టమాటా	46రూ.
వంకాయ	58
గుత్తి వంకాయ	60
బీరకాయ	38
పచ్చిమిర్చి	48
కాకరకాయ	38
బెండకాయ	34
పొట్లకాయ	60
దోసకాయ	48-68
గోరుచిక్కుడు	68
నాటుచిక్కుడు	140
క్యాబేజీ	34
దొండ	24-34
సొరకాయ	30
క్యారెట్	88
క్యాప్సికం	88
ఆలుగడ్డ	40
ఉల్లిగడ్డ	60-70
కోడిగుడ్ల ట్రే (30 గుడ్లు)	170
కొత్తిమీర కట్ట	40

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం మార్కెట్

సినిమా CINEMA

నగరంలో చిత్రాలు..

వినోద:	లక్కీభాస్కర్
శ్రీనివాస:	అమరన్
సాయిరాం:	బఘీర/సింగం
ఆదిత్య:	క
తిరుమల:	దేవర

డివిజన్	కార్పొరేటర్	సెల్‌నెంబర్
1	తేజావత్ హుస్సేన్	98485 29188
2	మలీదు వెంకటేశ్వర్లు	99497 01116
3	మలీదు జగన్	95501 06299
4	దండా జ్యోతిరెడ్డి	98669 25591
5	పల్లెబోయిన భారతి	95538 53111
6	నాగండ్ల కోటేశ్వరరావు	90630 12222
7	దొంగల సత్యనారాయణ	81065 01875
8	లకావత్ సైదులునాయక్	98483 81719
9	షేక్ జాన్‌బీ	77996 85786
10	చావా మాధురి	80968 64444
11	సరిపూడి రమాదేవి	99482 78404
12	చిరుమామిళ్ల లక్ష్మీ	98493 29742
13	కొత్తపల్లి నీరజ	98483 16224
14	కూరాకుల వలరాజు	99498 97577
15	రాపూరి కరుణ	92466 63945
16	మేడారపు వెంకటేశ్వర్లు	99126 44608
17	దనాల రాధా	95504 04444
18	మండదపు లక్ష్మీ	98480 18571
19	సీహెచ్ వెంకటనారాయణ	98485 88233
20	వీ ప్రశాంతలక్ష్మీ	98856 92345
21	ఆళ్ల నిరీశ	99487 14489
22	పల్లా రోశిలీనా	76599 87283
23	షేక్ మక్బూల్	98482 38953
24	కమర్తపు మురళీ	98859 74455
25	గోళ్ల చంద్రకళ	99495 29273
26	పునుకొల్లు నీరజ	94901 45220
27	దోడ్డా నాగేశ్వరరావు	88970 28299
28	గజ్జెల లక్ష్మీ	97019 23269
29	కొప్పెర సరిత	98489 41843
30	ముక్కల కమల	98483 04794
31	యర్రా గోపీ	77020 00447
32	జీనవాన్ సరస్వతి	96764 86370
33	తోటా ఉమారాణి	99511 25339
34	రుద్రగాని శ్రీదేవి	98496 34889
35	యల్లంపల్లి వెంకట్రావు	83282 18768
36	పసుమర్తి రామ్మోహన్‌రావు	98487 76665
37	షేక్ ఫాతిమాజోహారా	92465 55786
38	ఆలియా	98482 12872
39	మాధురి ప్రసాద్	98485 32871
40	దాదే అమృతమ్మ	96666 74646
41	కర్నాటి కృష్ణమూర్తి	99082 90555
42	పాకాలపాటి విజయనిర్మల	85001 65089
43	క్లైమెట్	98484 12449
44	పాలేపు విజయ	98669 25900
45	బుడిగెం శ్రీనివాస్	93993 70776
46	కర్నం వైష్ణవి	99668 66937
47	మాట్టేటి అరుణ	94403 58041
48	తోట గోవిందమ్మ	98480 15948
49	దుద్దుకూరి వెంకటేశ్వర్లు	98484 20471
50	రాపర్తి శరత్‌కుమార్	94940 43399
51	శీలంశెట్టి రమా	99492 28833
52	బుర్రి వెంకటేశ్వర్లు	99895 70941
53	పగడాల శ్రీవిద్య	94400 05558
54	మిక్కిలినేని మంజు	93969 66478
55	మోతారపు శ్రావణి	82975 49999
56	పగిడిపల్లి రోహిణి	98485 89580
57	మహ్మద్ రఫీదాబేగం	94901 88786
58	దోరేపల్లి శ్వేత	99639 07909
59	బట్టిపోతుల లలితారాణి	81878 71700
60	బద్దె నిరంజన్‌కుమార్	99667 72453

కొత్త కట్టడాలు.. కోటి ఆశలు

- నగరంలోనే అతి పెద్ద డివిజన్
- రోడ్లు, డ్రైనేజీలే ప్రధాన సమస్యలు
- శరవేగంగా నూతన భవనాల నిర్మాణం
- నిధుల లేమితో 58వ డివిజన్ వెనుకబాటు





గుంతలమయంగా వివేకానందనగర్ మట్టిరోడ్డు, రాపర్తినగర్ నుంచి బీసీ కాలనీ వెళ్లే కూడలి

డివిజన్ విజిట్

ఖమ్మంమార్కెట్, నవంబరు4(ఆంధ్రజ్యోతి): ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లోనే నూతన భవంతులు, నివాస గృహాల నిర్మాణంతో 58వ డివిజన్ ప్రాంతం దూసుకు పోతోంది. కార్పొరేషన్‌లోనే అతిపెద్ద డివిజన్‌ల్లో ఒకటైన ఇక్కడ పెద్దపెద్ద సమస్యలు తిష్ట వేశాయని స్థానికులు చెబుతున్నారు. బైపాస్‌రోడ్డుకు ఆనుకుని ఉన్న ఈ డివిజన్ వ్యాపారపరంగా అభివృద్ధిలో ఉన్నా నివాసాల మధ్య కనీస అవసరాలైన రోడ్లు, డ్రెయినేజీల విషయంలో వెనుకబడింది. అస్తవ్యస్త రోడ్లు, పూడిక తీయని డ్రెయినేజీలు, డంపింగ్ యార్డుకు చెత్తను తీసుకెళ్లె వాహనాల వల్ల దుర్గంధం స్థానికులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. డివిజన్‌లోని ముఖ్యంగా వివేకానందనగర్, దొరన్న కాలనీ, రమణగుట్ట ప్రాంతంలో రోడ్లు గుంతలమయంగా మారాయి. ఖాళీప్లాట్లలో ప్రదేశాలలో చెత్త, పిచ్చి మొక్కలతో దోమలబెడద, కోతులు, పందుల సంచారం ఎక్కువగా ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ప్రమాదకరంగా గణేష్ సెంటర్

రాపర్తినగర్-2 గణేష్ సెంటర్‌ఏరియాలో రోడ్డు గుంతల మయంగా ఉండి, డ్రైనేజీ నిర్వహణ సక్రమంగా లేక పోవడంతో వాహనదారులు నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ ప్రాంత ప్రజలు ఎన్నో సార్లు రోడ్డు ప్రక్కనే ఉన్న డ్రెయినేజీ గుంతను పూడ్చాలని అధికారులకు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సువిశాల ప్రాంతం

నగరంలో ప్రధాన రహదారి బైపాస్ రోడ్డు దగ్గర్నుంచి నుంచి పాతరూరల్ రిజిస్ట్రేషన్ ఆఫీస్ మీదుగా బీసీకాలనీ, టీఎన్‌జీవోస్ కాలనీ ఒకవైపు, మరోవైపు వివేకానందన నగర్, విద్యానగర్, గాయత్రి నగర్, హోసన్నామందిర్ ఒక వైపు, దొరన్న కాలనీ, రమణగుట్టలో కొంత భాగం వరకు అభివృద్ధిలో వెనుకబడి ఉంది.

రోడ్లు,డ్రెయినేజీలు అవసరం

నగరంలో భారీ వర్షాలకు వరద వచ్చినపుడు ఎక్కువగా ఇబ్బందిపడేది ఈ ప్రాంతం.. ఇక్కడి ప్రాంత వాసులకు ముఖ్యంగా డ్రెయినేజీ అంతర్గత రోడ్లు అత్యంత ఆవశ్యకంగా ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. ఖమ్మం కార్పొరేషన్‌గా అవతరించిన దగ్గర్నుంచి ఇప్పటి వరకు సుమారు రూ.8కోట్లతో సీసీరోడ్లు, డ్రెయినేజీ తదితర అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన అనంతరం మున్సిపల్, సుడాఫండ్‌ల నుంచి రూ.1.5 కోట్లకు టెండర్లు పూర్తైన తరువాత ప్రభుత్వం ఆయా టెండర్లను రద్దు చేసింది. నిధులు లేనికారణంగా అభివృద్ధికి దూరంగా ఉంది.

58వ డివిజన్ స్వరూపం

వైశాల్యం: సుమారు 3 కిలోమీటర్లు.

ఏరియాలు: రాపర్తినగర్-2, విద్యానగర్, గాయత్రినగర్, దొరన్నకాలనీ, రమణగుట్ట, హోసన్నామందిర్, బీసీ కాలనీ, జర్నలిస్టుకాలనీలు ప్రధానంగా ఉన్నాయి.

జనాభా: 9,000 మంది, ఓటర్లు సుమారు 5,700 మంది.

ఎక్కువ నిధులు కేటాయించాలి

కార్పొరేటర్ దోరేపల్లి శ్వేత



ఈడివిజన్‌లో అంతర్గత రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణానికి ప్రభుత్వం సహకరించాలి. ఎక్కువ విస్తీర్ణం, నూతన నివాస గృహాల కట్టడాలు ఉన్న డివిజన్‌కు ఎక్కువ నిధులు కేటాయించాలి. డంపింగ్ యార్డుకు వెళ్లె గుంతల రహదారి స్థానంలో నూతన సీసీ రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి.

డ్రెయినేజీలను మెరుగుపర్చాలి

చిలక కోటయ్య రాపర్తినగర్-2



నగరానికి నడిబొడ్డులో ఉండి కొత్త, పాత బస్టాండ్‌లు, రైల్వేస్టేషన్‌కు అతిచేరువలో ఉన్నా మాప్రాంతానికి డ్రెయినేజీ వ్యవస్థ సరిగ్గా లేదు. ఎక్కడి గుంతలు అక్కడే ఉంటున్నాయి. ఈ కారణంగా వాహనదారులు చాలాసార్లు ప్రమాదం బారినపడ్డారు. అంతర్గత రహదారులకు మరమ్మతులు చేయాలి

చెత్తను తొలగించట్లేదు

కమతం రఘురాం, వివేకానంద



58వడివిజన్ మొత్తం కూడా ఖాళీ ప్లాట్లు ఎక్కువగా ఉన్నాయి. అందులో చెత్త విపరీతంగా పెరిగినా వాటిని తొలగించరు. ప్రభుత్వం డివిజన్‌లోని అన్ని ప్రాంతాల్లో రోడ్లు, డ్రెయినేజీలు సక్రమంగా లేవు. ఈ ప్రాంతానికి ప్రత్యేకంగా నిధులు కేటాయించి మౌలిక వసతులు కల్పిస్తే ఈ ప్రాంతం ఇంకా అభివృద్ధి చెందుతుంది.

క్షేత్రస్థాయికి చేరిన సర్వే మెటీరియల్

- 965ఎన్యూమరేటర్లకు 14మంది స్పెషల్ ఆఫీసర్లు
- ఇప్పటికే 3వేలకు పైగా నివాసాలకు ముందస్తు అవగాహన స్టిక్కరింగ్
- నేడు కార్పొరేటర్లతో ఇన్‌చార్జ్ కమిషనర్ శ్రీజ అవగాహన సమావేశం

ఖమ్మంసంక్షేమవిభాగం,నవంబరు5 (ఆంధ్రజ్యోతి): సమగ్ర ఇంటింటి సర్వేకు ఖమ్మం నగర పాలక సంసంస్థ అధికారులు వేగంగా చర్యలను చేపడుతున్నారు. ఇప్పటికే సర్వేకు కావాల్సిన 965ఎన్యూమరేటర్ల బృందాల జాబితాలను పూర్తి చేశారు. బిల్‌కలెక్టర్లు వారీగా ప్రత్యేకంగా కౌంటర్లు ఏర్పాటు చేసి సర్వే బృందాలకు కావాల్సిన సమాచారం, మ్యాప్‌లను పంపిణీ చేశారు. ఇంటింటి సర్వేకు కావాల్సిన జ్యూట్ బ్యాక్, పెన్నులు, పెన్సిల్, ప్యాడ్, మార్కర్, ఎరేజర్‌తో కూడిన బ్యాగ్‌లను క్షేత్రస్థాయిలోకి పంపిణీ చేశారు. 965 ఎన్యూమరేటర్ బ్లాక్‌ల పర్యవేక్షణకు నల్గురు కేఎంసీ అధికారులకు ప్రత్యేక బాధ్యతలను అప్పగించారు. 1నుంచి 250 వరకు ఆర్ విజయానంద్, 251 నుంచి 500 వరకు ఏ జ్యోతి, 501 నుంచి 750 వరకు వజ్జా రామారావు, 751 నుంచి 965 వరకు ఏ.సుధాకర్‌లను సూపర్‌వైజర్లుగా నియామకం చేశారు. క్షేత్రస్థాయిలో 26 మంది సూపర్‌వైజర్లను నియామకం చేశారు. వారిపై పర్యవేక్షణకు ప్రతి ఇద్దరు సూపర్‌వైజర్లకు ఒక స్పెషల్ ఆఫీసర్ చొప్పున కేఎంసీ పరిధిలో 14 మంది స్పెషల్ ఆఫీసర్లకు బాధ్యతలు కేటాయించారు. రోజూ ఇంటింటి సర్వే డేటాసేకరణ, క్షేత్రస్థాయి సర్వేకు కేఎంసీకి మధ్య స్పెషల్ ఆఫీసర్లు రిపోర్టు చేయనున్నారు. కాగా మంగళవారం నాటికి 3వేలకు పైగా సర్వే స్టిక్కర్లను అంటించారు. ముందస్తుగా సర్వేపై యజమానులకు అవగాహన కల్పించారు.



సర్వే బృందాలకు జూట్ బ్యాగ్‌లతో మెటిరియల్

నేడు కార్పొరేటర్లకు అవగాహన

ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలోని 60 డివిజన్లలో కార్పొరేటర్లకు స్థానిక సంస్థల అసిస్టెంట్ కలెక్టర్, ఇన్‌చార్జ్ కమిషనర్ శ్రీజ అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఇంటింటి సర్వేకు ప్రభుత్వం నుంచి వచ్చిన మార్గదర్శకాలు, కేఎంసీలో ఏర్పాటు చేసిన బృందాలు, సర్వేలో ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంపై వివరించనున్నారు.

రోగులకు సమర్థ సేవలు అందాలి

- బయోమెట్రిక్ ద్వారా వైద్యులు, సిబ్బంది హాజరు నమోదు
- గర్భిణుల ఏఎన్‌సీ రిజిస్ట్రేషన్లపై దృష్టి సారించాలి
- వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో అదనపు కలెక్టర్ సమీక్ష

ఖమ్మంకలెక్టరేట్, నవంబరు5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్యశాలల్లో రోగులకు సమర్థ సేవలు అందించాలని, ఆ దిశగా జిల్లాలో కార్యక్రమాలు చేపట్టాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజ అన్నారు. మంగళవారం ఆమె కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో వైద్య ఆరోగ్యశాఖపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని 26 పీహెచ్‌సీలు, 4అర్బన్ పీహెచ్‌సీలలో అందుబాటులో ఉన్న మందుల వివరాలను ప్రదర్శించాలన్నారు. వీటిని రేపటిలోగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జిల్లాలో వైద్యఆరోగ్యశాఖ పట్ల జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టిసారించిందని, ఎక్కడ చిన్న పొరపాటు, తప్పు జరిగినా చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. మెడికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ సంబంధించి జిల్లాలో ప్రైవేటు ఆసుపత్రుల తనిఖీ చేసి రిజిస్ట్రేషన్, రెన్యువల్స్, అక్కడ ఉన్న సౌకర్యాలను పరిశీలించి, నవంబరు నాటికి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. పీసీపీఎన్డీటీ క్రింద స్కానింగ్ సెంటర్ల తనిఖీలు వారం రోజులలో పూర్తి చేయాలన్నారు. పీహెచ్‌సీలో బయోమెట్రిక్ అటెండెన్స్ ద్వారా వైద్యులు, సిబ్బంది హాజరు నమోదు చేయాలని ఆదేశించారు. టీబీ కేసుల గుర్తింపు, వారికి అవసరమైన చికిత్స అందించడం, మొదలగు కార్యక్రమాలను పక్కాగా అమలు చేయాలని అన్నారు. ప్రతీ గర్భిణి ఏఎన్సీ రిజిస్ట్రేషన్ చేయించి వారికి పూర్తిస్థాయిలో టీకాలు అందేలా చూడాలన్నారు. హై రిస్క్ ప్రెగ్నెన్సీ కేసుల ప్లానింగ్ పక్కగా జరిగేలా చూడాలన్నారు. అనీమియా ఉన్న మహిళల పట్ల ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మొదటి కాన్పు జరిగే మహిళలను సాధారణ ప్రసవాల దిశగా ప్రోత్సహించాలని సూచించారు. సబ్ సెంటర్ల పరిధిలోనే అవసరమైన వ్యాయామం, యోగా చేయించాలని అన్నారు.ఈ సమావేశంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి బి. కళావతిబాయి, జిల్లా టీబీ అధికారి వి. సుబ్బారావు, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సైదులు, వైద్య ఆరోగ్య అధికారులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

తిరుమలాయపాలెం,నవంబరు5 (ఆంధ్రజ్యోతి): మండలంలని వివిధ గ్రామపంచాయతీల్లో పెండింగ్ బిల్లులు చెల్లించాలని సర్పంచ్‌ల సంఘం మాజీఅధ్యక్షుడు ఆలస్యం నాగేశ్వరరావు, గడ్డికొప్పుల రాజు కోరారు. మంగళవారం దమ్మాయిగూడెంలో సంఘం సమావేశంలోమాట్లాడారు. మండలంలోని 40గ్రామ పంచాయతీల్లో ఐదేళ్లలో అప్పులు తెచ్చి పనులు చేశామని, నేటికి బిల్లులు రాకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామ పంచాయతీలకు నిధులుమంజూరు చేసినా స్పెషలాఫీసర్లు, పంచాయతీ కార్యదర్శులు నిధులు విడుదల కాకుండా అడ్డుపడుతున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో దేవరం దేవేందర్‌రెడ్డి, రాంమోహన్‌రెడ్డి, అలివేలమ్మ, పాల్గొన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో వినతిపత్రం అందించారు.

వీరి వైద్యసేవలు ఎక్కడో?

- సమన్వయంలేక విధులకు దూరంగా మలేరియా విభాగం
- కేఎంసీ అధికారుల పర్యవేక్షణలో లేని వైనం

ఖమ్మంసంక్షేమవిభాగం, నవంబరు5 (ఆంధ్రజ్యోతి): మలేరియా విభాగం ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలో పని చేయాల్సి ఉంటుంది.. కానీ ఆ విభాగంగా మలేరియా ఉద్యోగులు ఇటు కేఎంసీకి కాకుండా ఆటు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధి కాకుండా వీరి విధులు ఎక్కడా అనేది ప్రశ్నగా మారింది. ఇది ఖమ్మం నగర పాలక సంస్థలో చర్చనీయాంశంగా మారింది. అయితే మలేరియా విభాగం ఉద్యోగులు మాత్రం మేము కూడా ఖమ్మం నగరంలోనే వైద్యసేవలు అందిస్తున్నామని పేర్కొంటున్నారు. సీజనల్ వ్యాధులు వ్యాప్తికి ముందే ప్రజలకు అవగాహన కల్పించి డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా వంటి జ్వరాల సంబంధిత వ్యాధుల నుంచి రక్షణ కల్పించేందుకు మలేరియా వైద్య సిబ్బంది బాధ్యతలు నిర్వహిస్తారు. ఖమ్మం నగర ప్రజలకు సీజనల్ వ్యాదుల వ్యాప్తి చెందకుండా ఉండేందుకు వారికి వైద్య సేవలు అందించేందుకు పూర్వకలెక్టర్ కర్ణన్ జిల్లాలో పని చేసిన రోజుల్లో జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయంలో ఉన్న మలేరియా విభాగాన్ని ఖమ్మం నగర పాలక సంస్థకు బదలాయించారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి సీనియర్ ఎంట్రామాలజిస్టుతో పాటుగా పర్యవేక్షకులు, హెల్త్ అసిస్టెంట్లు, ఇతర క్షేత్రస్థాయి సిబ్బంది ఖమ్మం నగర పాలక సంస్థకు వచ్చి బాధ్యతలు స్వీకరించారు. ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలో వ్యాప్తి చెందిన మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యూ, ఇతరవైరల్ జ్వరాలను కంట్రోల్ చేశారు.

సమన్వయం లేక...

కేఎంసీ మలేరియా విభాగానికి సీనియర్ ఎంట్రామాలజీస్టుగా గతంలో వెంకటేశ్వర్లు మంచి సేవలు అందించారు. ఫాగింగ్ నుంచి పైరత్రియన్ పిచికారి వరకు, డెంగ్యూ, మలేరియా, చెకెన్ గున్యూ, టైఫాయిడ్ జ్వరాల నియంత్రణలో కీలకంగా పనిచేశారు. మూడేళ్ల క్రితం పదోన్నతితో కూడిన బదిలీ జరగటంతో వరంగల్‌కు వెళ్లారు. వెంకటేశ్వర్లును తిరిగి తీసుకొచ్చేందుకు పూర్వ కలెక్టర్లు లేఖలు రాశారు. వైద్యఆరోగ్యశాఖ నుంచి ఆదేశాలు విడుదల కాక పోవటంతో ఆయన తిరిగి కేఎంసీకి రాలేదని తెలుస్తోంది. అయితే సీనియర్ ఎంట్రామాటజిస్టు బదిలీపై వెళ్లిన తర్వాత ఖమ్మం నగర పాలక సంస్థ అధికారులకు మలేరియా విభాగం ఉద్యోగులకు మధ్య సమన్వయం లోపించింది.

సమీక్షిస్తాం: అహ్మద్ ఉల్లా, అసిస్టెంట్ కమిషనర్, కేఎంసీ

మలేరియా విభాగం ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలోనే బాధ్యతలు నిర్వహించాల్సి ఉంటుంది. ఇప్పటి వరకు ఫాగింగ్, ఇతర కార్యక్రమాలు పారిశుద్య సిబ్బంది ద్వారా నిర్వహిస్తున్నాం. మలేరియా విభాగం ఎక్కడ పనిచేసే విషయంపై జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారులతో సమీక్షించి మలేరియా విభాగం వైద్య సిబ్బందిని ఖమ్మం నగర పాలకంలో వైద్యసేవలకు వినియోగిస్తాం.



కేఎంసీ మలేరియా అధికారి ఛాంబర్

రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి



ధాన్యం కొనుగోలును ప్రారంభిస్తున్న నరేష్‌రెడ్డి

తిరుమలాయపాలెం,నవంబరు5(ఆంధ్రజ్యోతి): రైతుసంక్షేమానికి ప్రభుత్వం కృషి నిరంతరం శ్రమిస్తుందని, జిల్లాకాంగ్రెస్ నాయకులు బీరోలు సొసైటీ ఛైర్మన్ రామసహాయం నరేష్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని సుబ్లేడులో పౌరసరఫరాలశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. దళారీల మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. పంటలకు మద్దతు ధర కలిపించి రూ.500బోనస్ అందిస్తున్నట్టు తెలిపారు. ఈకార్యక్రమంలో ఏఈ నారెడ్డి సీతారాంరెడ్డి, మాజీసర్పంచ్ సంజీవయ్య, సీవో సత్యం, ఓర వెంకటేశ్వర్లు, సుమన్‌రెడ్డి, ఏఈవో బాలకృష్ణ, పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలపై పోరాడేది టీపీటీఎఫ్



గోవిందరావు, రామారావు

నేలకొండపల్లి,నవంబరు5(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి నిక్కచ్చిగా పోరాడేది టీపీటీఎఫ్ మాత్రమేనని సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తేజావత్ వెంగళరావు అన్నారు. నేలకొండపల్లిలోని పీఎమ్మార్ ట్రస్టు కార్యాలయం ఆవరణలో గోవిందరావు అధ్యక్షతన మంగళవారం జరిగిన మండల కౌన్సిల్ సమావేశంలో వెంగళరావు పాల్గొన్నారు. ఉపాధ్యాయ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తేజావత్ గోవిందరావు, ప్రధాన కార్యదర్శిగా రామారావులతో పాటు కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.విజయ్, నాయకులు పెద్ది జగన్నాధం, వెంకటరావు, జ్యోతి, భాగ్యలక్ష్మి, నాగుల్‌మీరా, శంకర్, సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

రూ.2లక్షల రుణమాఫీ చేయాలి

తిరుమలాయపాలెం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఎటువంటి షరతులు లేకుండా రైతులకు రుణమాఫీ చేయాలని టీడీపీ పాలేరు ఇన్‌చార్జి కొండబాల కరుణాకర్ కోరారు. మంగళవారం తిరుమలాయపాలెంలో పార్టీకార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ అర్హులైన రైతులందరికి రూ.2లక్షలలోపు రుణమాఫీ చేయాలన్నారు.

క్యాంపస్ ఎంపికల్లో ఎస్‌బీఐటీ విద్యార్థుల ఎంపిక

ఖమ్మంఖానాపురంహవేలి నవంబరు5 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎస్‌బీఐటీ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు 28 మంది బహుళజాతి కంపెనీ కొలాబెరాకు ఎంపికైనట్లు కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. మంగళవారం కళాశాలలో నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో మెత్తం 120 మంది సీఈసీ, ఇసీఈ విద్యార్థులు పాల్గొనగా, వారిలో 28 మంది విద్యార్థులు ఎంపికైనట్లు తెలిపారు. 6నెలల శిక్షణలో రూ.3లక్షల వేతనం, అనంతరం రూ.4 లక్షల వేతనాలు చెల్లిస్తారని చెప్పారు. వీరిని కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ జీ ధాత్రీ, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ అభినందించారు.



ఎంపికైన విద్యార్థులతో కళాశాల ఛైర్మన్ కృష్ణ

'ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి'

ఏన్కూరు, నవంబరు5(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ, ఉద్యోగులసమస్యలను పరిష్కరించాలని యూటీఎఫ్‌జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానికజిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో నిర్వహించిన మండల మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం మండల నూతన కమిటీనీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడు బానోతు రాంచంద్, ప్రధాన కార్యదర్శిగా మూడ్ పుల్లయ్య, ఉపాధ్యక్షులుగా వి.శ్రీదేవి, జే.పుల్లయ్య, కోశాధికారిగా బి.నర్సింహారావు ఎన్నికయ్యారు. ఈకార్యక్రమంలో జిల్లా కార్యదర్శి డీఎస్ నాగేశ్వరరావు, బానోతు రాందాస్, లక్ష్మికుమారి, సుధాకరావు, రాఘవరావు, శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో గురుకుల క్రీడాకారుల ప్రతిభ


రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఏన్కూరు, నవంబరు5(ఆంధ్రజ్యోతి): ఖమ్మం సర్దార్‌పటేల్‌స్టేడియంలో ఈనెల 4న జరిగిన ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ పాఠశాల స్థాయి క్రీడా పోటీల్లో ఏన్కూరు గురుకుల పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. అండర్ 14,17లలో ప్రథమ, ద్వితీయ స్థానాలను కైవసం చేసుకున్నారు. అండర్-14లో 400మీటర్ల పరుగుపందెంలో మహదీప్ ప్రథమ, 100 మీటర్ల పరుగుపందెంలో నరేష్ ద్వితీయ, షాట్‌పుట్‌లో చందులాల్,నరేష్ ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు. 600 మీటర్ల పరుగుపందెంలో విజయ్ ద్వితీయ స్థానం, హార్డిల్‌లో వరుణ్‌చౌహాన్ ద్వితీయస్థానం సాధించారు. అండర్ 17లో జావిలింగ్‌త్రోలో శరత్ ప్రథమ, షాట్‌పుట్‌లో రోహిత్ ప్రథమస్థానం సాధించాడు. ఈసందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపల్ తుడి శ్రీనివాసరెడ్డి, ఏటీపీ సునీల్, వేమురాజు, పీఈటీ వీరయ్య పాల్గొన్నారు.

అసంపూర్తిగా వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ నిర్మాణం

» నిధుల్లేక నిలిచిన వైనం » త్వరగా భవనం పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీవాలని వేడుకోలు

సత్తుపల్లి, నవంబరు5(ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి మునిసిపాలిటీ పరిధిలో గత ప్రభుత్వ హయాంలో మంజూరైన ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్‌వెజ్ భవన నిర్మాణం మూడున్నర సంవత్సరాలైనా పూర్తి కాలేదు. సత్తుపల్లిలో పట్టణ ప్రగతి కార్యక్రమంలో భాగంగా 2021 ఏప్రిల్ రెండో తేదీన అప్పటి మునిసిపల్ శాఖా మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేశారు. శంకుస్థాపన సమయంలో అంచనా వ్యయం రూ.రెండు కోట్లుగా ప్రకటించి, దీని నిర్మాణం ఏడాది కాలంలో పూర్తి చేయాలని అప్పటి మంత్రి కేటీఆర్ ఆదేశించారు. కాని మూడున్నరేళ్ల గడిచినా దీని నిర్మాణం ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా తయారైంది.

కలెక్టర్ ఆదేశించినా పూర్తి కాని పనులు

2021లో శంకుస్థాపన జరిగిన వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ పనులు సకాలంలో జరగకపోవడంతో గత జిల్లా కలెక్టర్‌గా పని చేసిన వీపీ గౌతమ్ పలు సందర్భాల్లో సత్తుపల్లి పర్యటనకు వచ్చిన ప్రతిసారి వెజ్, నాన్‌వెజ్ మార్కెట్‌ను సందర్శించి అసంతృప్తి వ్యక్తం చేశారు. సకాలంలో పనులు పూర్తి చేయించాలని అధికారులను ఆదేశించారు. పనులు జాప్యం చేస్తే కాంట్రాక్టర్‌ను బ్లాక్ లిస్టులో కూడా పెట్టాలని ఆదేశించారు. అయినా అప్పటి అధికారులు స్పందించకపోవడంతో పనులు ముందుకు సాగలేదు. కాలక్రమంలో సాధారణ ఎన్నికలు రావడం ఎన్నికల కోడ్ కారణంగా పనులు నిలిపివేశారు. తరువాత ప్రభుత్వం మారడంతో కాంట్రాక్టర్ పనులను పూర్తిగా వదిలేశారు. దీంతో ఎక్కడిపనులు అక్కడే నిలిచిపోయాయి. ప్రస్తుతం ఈ పనులను పర్యవేక్షించే వారు లేకపోవడంతో వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ పూర్తయ్యే పరిస్థితి కనిపించడం లేదు.


ఫిల్లర్ల దశలో ఆగిపోయిన నిర్మాణాలు

బిల్లులు మంజూరు కాలేదని...

మార్కెట్ నిర్మాణ పనులకు బిల్లులు మంజూరు కాలేదని కాంట్రాక్టర్ పనులు నిలిపివేసినట్లు చెబుతున్నారని మునిసిపల్ కమిషనర్ రవిబాబు చెప్పారు. బిల్లుల సమస్య కారణంగానే పనులు నిలిపివేసినట్లు తమకు కాంట్రాక్టర్ చెప్పినట్లు వివరించారు. ఈ విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామని తెలిపారు.

ఇంటింటి సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

» ఆర్డీవో నర్సింహారావు

మధిరటౌన్, నవంబరు3(ఆంధ్రజ్యోతి): ఇంటింటి సర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని ఖమ్మం ఆర్డీవో జి. నరసంహారావు అన్నారు. మంగళవారం ఆయన మధిర పట్టణంతో పాటు మండలంలోని సరిపురం గ్రామంలో ఇంటింటికి స్టిక్కర్ అంటించే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీపీవో శ్రీనివాస్, తహసీల్దార్ రాంబాబు, మునిసిపల్ కమిషనర్ సంపత్ కుమార్, ఎంపీడీవో వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


బోనకల్‌లో స్టిక్కరింగ్ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో నర్సింహారావు

వైరా, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): వైరా మండలంలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే సన్నాహక ప్రక్రియను మంగళవారం నిర్వహించారు. వైరా 8వ వార్డులో ఇంటింటికి స్టిక్కర్లు వేసే కార్యక్రమాన్ని తహసీల్దార్ కేవీ.శ్రీనివాసరావు పరిశీలించారు. 2011 జనాభా లెక్కల ప్రకారం వైరా మండలంలో 21,007 ఇళ్లు ఉన్నాయి. వీటిని 142 బ్లాక్‌లుగా విభజించారు. 142మంది ఎన్యూమరేటర్లు, 15మంది సూపర్‌వైజర్లను నియమించారు. ఈనెల 8న మండలంలోని స్నానాల లక్ష్మీపురం గ్రామంలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ ప్రారంభించనున్నారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు.


ముదిగొండలో..

ముదిగొండ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ సునీత ఎల్జిబెత్ సూచించారు. మంగళవారం పలు గ్రామాల్లో స్టిక్కరింగ్ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్ఐ ప్రసన్నకుమార్, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ పాల్గొన్నారు.

ఎర్రుపాలెం, నవంబరు5(ఆంధ్రజ్యోతి): సర్వేపై అవగాహన ఉండాలని ఆర్డీవో గరిడి నర్సింహారావు అన్నారు. మంగళవారం సర్వే స్టిక్కర్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ మన్నె ఉషాశారద, ఎంపీడీవో సురేందర్, ఆర్ఐ రవికుమార్, ఏఎస్‌వో మహ్మద్ జాన్ దర్గాసాహెబ్, పంచాయతీ కార్యదర్శి ఏలేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

బోనకల్, 5(ఆంధ్రజ్యోతి): కుల గణన సర్వేను సమర్ధవంతంగా నిర్వహించాలని ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు సూచించారు. మండలంలోని జానకీపురం గ్రామంలో ఇంటింటా సర్వే స్టిక్కరింగ్ కార్యక్రమాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. సర్వే సిబ్బందికి ప్రజలు సహకరించాలని కోరారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో కుల గణన సర్వే పై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పున్నం చందర్, ఎంపీడీవో ఆర్. రమాదేవి, గిర్దావర్ జి. లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన ధాన్యాన్ని తీసుకురావాలి

» అడిషనల్ కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, జిల్లా ప్రత్యేక అధికారి సురేంద్రమోహన్

కల్లూరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాలకు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని అడిషనల్ కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, జిల్లా ప్రత్యేక అధికారి సురేంద్రమోహన్‌లు అన్నారు. మంగళవారం మండలంలోని గోపాలదేవబోయినపల్లి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు రైతులతో మాట్లాడారు. ధాన్యం కొనుగోలులో అనుసరించాల్సిన విధానంపై రైతులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రాజేంద్రగౌడ్, మండల ప్రత్యేక అధికారి శ్రీలత, తహసీల్దార్ సాంబశివుడు, ఏపీఎం వెంకటరామారావు తదితరులు పాల్గొన్నారు.

దళారులకు మేలు చేస్తున్న సీసీఐ సిబ్బంది

» న్యూడెమోక్రసీ నేత మధు ఆరోపణ

కారేపల్లి నవంబరు5(ఆంధ్రజ్యోతి): సీసీఐ కేంద్రాలలో పనిచేస్తున్న కొందరు దళారులకు మేలు జరిగే విధంగా సహకరిస్తున్నారని న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు అవునూరి మధు ఆరోపించారు. మంగళవారం మండల కేంద్రంలో సీసీఐ కేంద్రం వద్ద ఆందోళన చేపట్టారు. రైతులు తీసుకవస్తున్న పత్తిని ఎలాంటి షరతులు లేకుండా, తేమశాతం పరిగణలోకి తీసుకోకుండా కొనుగోలు చేయలన్నారు. రైతులకు అన్యాయం చేస్తే ఆందోళన చేస్తామన్నారు. రైతులు తీసుకవస్తున్న పత్తిలో తేమశాతం అధికంగా ఉందని పత్తిని కొనుగోలు చేసేందుకు నిరాకరిస్తుండటంతో ఇది మధ్య దళారులకు మేలు చేస్తున్నట్లుగా ఉందని అన్నారు. ఈకార్యక్రమంలో ప్రకాష్, చింత రజిత, చిరంజీవి, మస్తాన్, నరసింహారావు, చంటి పాల్గొన్నారు.

హెల్త్‌క్యాంపు పేరుతో మోసం చేస్తున్నారంటూ ఫిర్యాదు

తల్లాడ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): హెల్త్ క్యాంపు పేరుతో ఓ ఛారిట్రబుల్ ట్రస్టు నిర్వాహకులు ప్రజలను మోసం చేస్తున్నారని మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో బీజేపీ తల్లాడ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఆపతి వెంకటరామారావు, గాదె కృష్ణారావు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో వారు పేర్కొన్న వివరాలిలా ఉన్నాయి. తల్లాడ మండలం మంగాపురం గ్రామంలో మంగళవారం ఓ చారిట్రబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో హెల్త్ అండ్ న్యూట్రీషియన్ ఫుల్‌బాడీ స్కానింగ్ క్యాంపు నిర్వహించి, చెకప్ కోసం ఒక్కొక్కరి నుంచి రూ.270వసూలు చేసినట్లు వారు తెలిపారు. చెకప్ తర్వాత జబ్బులున్నాయని చెప్పి తగ్గేందుకు తమ దగ్గర ఉన్న మందులు వాడాలని సూచిస్తూ వేలాదిరూపాయలు వసూలు చేసినట్లు వారు ఆరోపించారు. హెల్త్‌క్యాంపు పేరుతో ప్రజలను మోసం చేస్తున్న ట్రస్టు నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు.

'మునిసిపాలిటీ పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలి'

వైరా, నవంబరు5(ఆంధ్రజ్యోతి): వైరా మునిసిపాలిలో 2019నుంచి స్పెషల్ డ్రైవ్‌లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గాదె లక్ష్మీనారాయణ, తోట రామాంజనేయులు డిమాండ్ చేశారు. వైరా మునిసిపల్ కార్యాలయం ముందు మంగళవారం పారిశుధ్య కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించారు. సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని మునిసిపల్ కమిషనర్ చింతా వేణుకు అందజేశారు. ఆ సంఘం నాయకులు గారపాటి అశోక్, యామాల గోపాలరావు, రాయపూడి శ్రీను, సాంబ, రాందాస్, లక్ష్మయ్య, సామ్రాజ్యం, అరుణ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పుల్లయ్యకు బెయిల్

చింతకాని, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఇటీవల ఓ కేసులో అరెస్ట్ అయిన బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్యకు మంగళవారం జిల్లా కోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. బెయిల్‌పై విడుదల అయిన పెంట్యాల పుల్లయ్యకు గ్రామంలో కుటుంబ సభ్యులు, బీఆర్‌ఎస్ కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు.

నగదు డ్రా చేసిన ఇరువురిపై కేసు నమోదు

తల్లాడ, నవంబరు5(ఆంధ్రజ్యోతి): తల్లాడ సొసైటీ కార్యాలయంలో రైతుల ఏటీఎం కార్డులు అపహరించి, నగదు డ్రా చేసిన ఇరువురు వ్యక్తులపై సోమవారం రాత్రి తల్లాడ పోలీసులు కేసు నమోదు చేశారు. 2018వ సంవత్సరంలో తల్లాడ సొసైటీ కార్యాలయంలో 719మంది రైతులకు సంబంధించిన రూపేకార్డులను మల్లవరం గ్రామానికి చెందిన దుగ్గిదేవర వెంకటకృష్ణారావు, బెల్లంకొండ చిన్నసైదులు అపహరించి రూ.40.56లక్షలు నగదు డ్రా చేశారు. ఈ విషయమై 2021వ సంవత్సరంలో బాధిత రైతుల ఫిర్యాదు మేరకు జిల్లా సహకారశాఖ అధికారులు విచారణ జరిపారు. కాగా వెంకటకృష్ణారావు, చిన్నసైదులు నుంచి రూ.40లక్షల నగదును రికవరీ చేసి బాధిత రైతుల ఖాతాల్లో జమచేశారు. రైతులను మోసగించిన ఇరువురిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని తల్లాడ సొసైటీ కార్యదర్శి నాగబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ బి.కొండల్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మట్టి టిప్పర్ల పట్టివేత

ముదిగొండ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ముదిగొండ మండలం బాణాపురం సమీపంలో అక్రమంగా మట్టిని తరలిస్తున్న ఐదు టిప్పర్ లారీలను మంగళవారం తెల్లవారుజామున పోలీసులు పట్టుకున్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా మట్టిని టిప్పర్ లారీల ద్వారా తరలిస్తున్నారనే సమాచారం మేరకు పట్టుకున్నారు. ఎలాంటి అనుమతి పత్రాలు చూపించకపోవడంతో మట్టిని రవాణా చేస్తున్న టిప్పర్ లారీలను పట్టుకొని స్టేషన్‌కు తరలించారు.

పారిశుధ్యంపై దృష్టి పెట్టండి

● డీపీవో ఆశాలత

ముదిగొండ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యంపై దృష్టిసారించాలని పంచాయతీ కార్యదర్శులను జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత ఆదేశించారు. మండలంలోని ముదిగొండ, లక్ష్మీపురం, సువర్ణాపురం గ్రామాల్లో మంగళవారం ఆమె ఆకస్మికంగా పర్యటించారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో రాంబాబు, కార్యదర్శి రామకృష్ణ పాల్గొన్నారు.

చేపపిల్లల పంపిణీ

ముదిగొండ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ముదిగొండ మండలం వనంవారిక్రిష్ణాపురం గ్రామంలో మత్స్యశాఖ ఆధ్వర్యంలో చేపపిల్లలను పంపిణీ చేశారు. స్థానిక ఊరచెరువులో 42వేల చేపపిల్లలను విడుదల చేశారు. కార్యక్రమంలో మత్స్యకారుల సొసైటీ అడహక్ కమిటీ ఛైర్మన్ వెంకటేశ్వరరావు, తహసీల్దార్ సునీత ఎల్జిబెత్, ఎంపీడీవో శ్రీధర్‌స్వామి, ఎంఈవో రమణయ్య, ఆర్ఐ ప్రసన్నకుమార్, కార్యదర్శి శ్రీనివాస్, మల్లెల అజయ్, మత్స్యకారులు పాల్గొన్నారు.

విశ్రాంత ప్రిన్సిపాల్ ఇమ్మానుయేల్ మృతి


ఇమ్మానుయేల్

ఏన్కూరు, నవంబరు5(ఆంధ్రజ్యోతి): ఏన్కూరు గురుకుల పాఠశాల విశ్రాంత ప్రిన్సిపాల్ మున్నంగి ఇమ్మానుయేల్(67) సోమవారం రాత్రి గుండెపోటుతో మృతిచెందాడు. 2006 నుంచి 2015వరకు పాఠశలలో పనిచేసి ఎంతోమంది విద్యార్థులను తీర్చిదిద్దారు. మృతుడికి భార్య కుమారుడు, ఇద్దరు కుమార్తెలున్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ తుడి శ్రీనివాసరెడ్డి, మాజీ విద్యాకమిటీ సభ్యులు గుడ్ల వెంకటేశ్వరరావు, చెరుకు రాంబాబు, సీఐటీయూనాయకులు ఏర్పుల రాములు తదితరులు నివాళులర్పించారు.

వస్త్రవ్యాపారి రషీద్..



సత్తుపల్లిరూరల్, నవంబరు5 (ఆంధ్రజ్యోతి) : సత్తుపల్లికి చెందిన వస్త్ర వ్యాపారి, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సంఘ రాష్ట్ర నాయకుడు ఎంఏ.రషీద్ (58) హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గుండెపోటుతో సోమవారం రాత్రి మృతి చెందారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆయన మృతిపట్ల పలువురు సంతాపం తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

సత్తుపల్లిరూరల్, నవంబరు5 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి 33/11కేవీ సబ్ స్టేషన్ పరిధిలో బుధవారం ఉదయం 6గంటల నుంచి 9గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ ఏఈ శరత్‌బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పలు ఏరియాలలో విద్యుత్‌కు అంతరాయం కలుగుతుందని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆర్టీసీ సంస్థ అభ్యున్నతికి దోహదపడాలి

● ఆర్టీసీ ఖమ్మం రీజినల్ మేనేజర్ సరిరాం నాయక్


ఉద్యోగులకు బహుమతులు అందిస్తున్న ఆర్ఎం సరిరాంనాయక్

సత్తుపల్లి, నవంబర్5 (ఆంధ్రజ్యోతి): సమిష్టి కృషితో సంస్థకు మంచిపేరు వస్తోందని, మెరుగైన సేవలు అందిస్తూ సంస్థ అభ్యున్నతికి దోహదపడాలని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సరిరాం నాయక్ అన్నారు. ఈ ఏడాది కూడా ఉత్తమ డిపో కేటగిరిలో ప్రథమ స్థానంలో రాష్ట్రస్థాయిలో నిలిచి రూ.3లక్షల క్యాష్ రివార్డును అందుకున్న సందర్భంగా సత్తుపల్లి డిపోలో ఉద్యోగులకు బుధవారం అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఎం మాట్లాడుతూ ప్రయివేట్ వాహనరంగాన్ని తట్టుకుని సంస్థ ముందుకెళుతోందని, దూరప్రాంతాల సర్వీసులకు ఆదరణ బాగా లభిస్తోందన్నారు. ప్రయాణీకులకు మెరుగైన సదుపాయాలు కల్పిస్తూనే సిబ్బంది సంక్షేమానికి కృషి చేయడం జరుగుతోందని తెలిపారు. గడ్డుకాల పరిస్థితులను తట్టుకొని నిలబడగలిగే స్థాయికి సత్తుపల్లి డిపో ఎదగడంలో ప్రతిఒక్కరి కృషి ఉందన్నారు. ఉత్తమ సేవలు అందిస్తున్న సిబ్బంది, ఉద్యోగులు, అధికారులను ప్రోత్సహించాలన్న ఉద్దేశ్యంతో ఈ అవార్డులను అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు. భవిష్యత్‌లోనూ మరింత మెరుగైన సేవలు అందించాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎంలు పవిత్ర, భవానీప్రసాద్, ఇతర డిపో మేనేజర్లు శంకర్‌రావు, దినేష్ కుమార్, దేవేందర్, శ్యామ్‌సుందర్, పీవో సత్యనారాయణ, అసిస్టెంట్ మేనేజర్ పీ.విజయశ్రీ, గౌతమిలతో పాటు సూపర్‌వైజర్లు, ఏడీసీలు, యూనియన్ నాయకులు, రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఏఎన్‌ఎంలను రెగ్యులర్ చేయాలని వినతి

కారేపల్లి నవంబరు5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నేషనల్ మిషన్‌నందు గత 17 ఏళ్లగా రెండవ ఏఎన్‌ఎంలుగా పనిచేస్తున్న వారందరిని ప్రభుత్వం రెగ్యులర్ చేయాలని ఏఎన్‌ఎంలు కోరారు. మంగళవారం కారేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్ఎలు నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఈనెల 17న హైద్రాబాద్‌లోని శంషాబాద్‌లో జరగబోయే తెలంగాణ రాష్ట్ర రెండవ ఏఎన్‌ఎంల ప్రథమ మహాసభల గోడపత్రికను అవిష్కరించారు. ఈసందర్భంగా ఏఎన్‌ఎంలు మాట్లాడుతూ ప్రభుత్వం రెగ్యులర్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏఎన్‌ఎంల సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

మదర్‌థెరిస్సా కళాశాలలో ప్రాంగణ ఎంపికలు

సత్తుపల్లిరూరల్, నవంబరు5 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ కంపెనీ క్యూస్పైడర్స్ ద్వారా మండలంలోని కొత్తూరులోని మదర్‌థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలో ప్రాంగణ నియామకాలు నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ చలసాని హరికృష్ణ మంగళవారం తెలిపారు. 30 మంది విద్యార్థులను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను సెక్రటరీ, కరస్పాండెంట్ చలసాని సాంబశివరావు, చైర్మన్ కంచర్ల సత్యనారాయణ, ఇంజనీరింగ్ డీన్ డా.జాకీర్‌హుస్సేన్, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ డా.ఎంవీ.రామచంద్రరావు, ప్లేస్‌మెంట్స్ కో-ఆర్డినేటర్ టీ.రాఘవరావు అభినందించారు.

విజయ ఇంజనీరింగ్ కళాశాలలో

ఖమ్మం కొణిజర్ల, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అమ్మపాలెం పరిధిలో గల విజయ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం బెంగుళూరుకు చెందిన క్యూస్పైడర్ సొల్యూషన్స్ కంపెనీ ఆధ్వర్యంలో క్యాంపస్ రిక్రూట్‌మెంట్ నిర్వహించారు. 60 మందిని కంపెనీ ఎంపిక చేసినట్లు కళాశాల ఛైర్‌పర్సన్ విజయలక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ఆయేషా, ప్రిన్సిపాల్ చిన్నయ్య, డీన్ డాక్టర్ శ్రీనివాసరావు, ఏవో పరిధ్‌బాబా, క్యూస్పైడర్ సొల్యూషన్స్ కంపెనీ ప్రతినిధులు తదితరులు ఉన్నారు.

ఈఎంఆర్ఐలో ఉద్యోగ నియామకాలు

తల్లాడ, నవంబరు5(ఆంధ్రజ్యోతి): ఈఎంఆర్ఐ గ్రీన్‌హెల్త్ సర్వీసెస్ సంస్థ నందు 108వాహనాల్లో ఈఎంటీల నియామకాల కోసం ఈనెల ఏడున ఉద్యోగ నియామకాల ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రోగ్రాం మేనేజర్ భూమా నాగేందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈఎంటీ ఇంటర్వ్యూకు హాజరయ్యే అభ్యర్థులు తమ ఒరిజనల్ సర్టిఫికెట్లు, ఒక జీరాక్స్ సెట్‌ను వెంట తీసుకొని తల్లాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిగే ఇంటర్వ్యూకు హాజరుకావాలన్నారు. ఈఎంటీకి 22నుంచి 30సంవత్సరాల వయస్సు, 5.4అడుగులఎత్తు, బీఎస్సీ లైఫ్‌సైన్స్, బీఎస్సీ నర్సింగ్, డీఎంఎల్‌టీ, జీఎన్‌ఎం, ఏఎన్‌ఎం చేసిన వారు అర్హులని పేర్కొన్నారు. వివరాలకు 95428 66780 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

'రైతులు అప్రమత్తంగా ఉండాలి'

వైరా, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): విత్తన మొక్కజొన్న కొనుగోళ్లలో రైతులు అప్రమత్తంగా ఉండాలని వైరా ఏడీఏ తుమ్మలపల్లి కరుణశ్రీ, ఏవో మయాన్ మంజూఖాన్ సూచించారు. మండలంలోని రెబ్బవరంలో మంగళవారం రైతులతో క్షేత్ర సందర్శన నిర్వహించారు. ఏఈవోలు సైదులు, రాజేష్, వెంకటనర్సయ్య, వాసంతి, కీర్తి పాల్గొన్నారు.

ఘనంగా నాగులచవితి వేడుకలు




వైరా, తల్లాడల్లో పుట్టల వద్ద పూజలు చేస్తున్న భక్తులు

ఆర్థిక సాయం అందజేత


ఆర్థికసాయం అందజేస్తున్న బొర్రా ఉమాదేవి

వైరా, నవంబరు5(ఆంధ్రజ్యోతి): వైరా మునిసిపాలిటీ ఒకటో వార్డులో క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న మంకెన రాణి వైద్యఖర్చుల నిమిత్తం మాజీ జడ్పీటీసీ సభ్యురాలు బొర్రా ఉమాదేవి రూ.20వేలు ఆర్థిక సహాయాన్ని మంగళవారం అందజేశారు. దుగ్గిరాల బాలస్వామి కుమార్తె అయిన రాణి క్యాన్సర్ బారీనపడి నిరుపేద కుటుంబం కావడంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న విషయం తెలిసిన ఆమె ఆర్థికసాయం చేశారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన బత్తుల నర్సింహారావు కుటుంబానికి రూ.ఐదువేలు ఆర్థికసాయం అందజేశారు. కాంగ్రెస్ నాయకులు ధార్న రాజశేఖర్, వాసు, దుగ్గిరాల ఎలీషా, సామేలు, యాకోబు, బాబు, లాజర్, మహేష్, వసంత సుధాకర్, నవీన్, భూషణం, చరణ్ పాల్గొన్నారు.